E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



ఏపీ ప్రాజెక్టులను అడ్డుకోండి ....(3లో)

హైదరాబాద్ (తేదీ) 01-03-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:59|| పేజీలు–6 www.ekaburu.com



## రేవంత్, యోగి ఒకటే

- తెలంగాణలోనూ బుల్డోజర్ల పాలన: అక్బరుద్దీన్
- రేవంత్ రెడ్డి, యోగి ఆదిత్యనాథ్ ఇద్దరిదీ ఒకటే తీరన్న అక్బరుద్దీన్
- తెలంగాణలోనూ బుల్డోజర్లతో మసీదులు కూల్చివేస్తున్నారని ఆరోపణ
- ముస్లింల విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైపోతాయని విమర్శ
- మైనారిటీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదని ఫైర్
- ముస్లింలు మేల్కొని మజ్లిస్‌కు మద్దతివ్వాలని పిలుపు

**ఈ కబురు, హైదరాబాద్ :**
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరిదీ ఒకటే తీరని ఎంఐఎం శాసనసభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూపీ తరహాలోనే తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో మసీదులు, దర్గాలను కూల్చివేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. పాతబస్తీలోని తలాబ్‌కట్టలో గురువారం రాత్రి జరిగిన ఒక సమావేశంలో ఆయన ప్రసంగించారు.

02



# యుద్ధ జ్వాల

- ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయెల్
- ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణుల వర్షం
- 201 మంది మృతి.. అందులో 86 మంది విద్యార్థినులే..
- ఇరాన్ రక్షణ మంత్రి, ఐఆర్‌జీ కమాండర్ సైతం హతమైనట్లు రాయిటర్స్ కథనం
- దేశాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరానీయులకు ట్రంప్ పిలుపు
- పశ్చిమాసియా, గల్ఫ్‌లకు వేలకొద్దీ విమాన సర్వీసుల రద్దు

దుబాయ్, టెల్ అవీవ్, వాషింగ్టన్: పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం మొదలైంది. గల్ఫ్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఇరాన్ లక్ష్యంగా శనివారం అమెరికా, ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగాయి. దీనికి ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అగ్రరాజ్యం చేపట్టిన ఈ దాడులతో దేశమంతా అట్టుడికింది. ఈ దాడుల్లో ఇరాన్ రక్షణశాఖ మంత్రి అమీర్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహమ్మద్ పాక్‌పౌర్ మృతి చెందినట్లు రాయిటర్స్ పేర్కొంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దక్షిణ ఇరాన్‌లోని ఓ పాఠశాలపై బాంబులు పడటంతో 86 మంది విద్యార్థినులు మరణించారు. వారితోపాటు ఇరాన్‌లో మొత్తం 201 మంది మరణించారు. 747 మంది గాయపడ్డారని రెడ్ క్రెసెంట్ వెల్లడించింది. ఇరాన్ ప్రతి దాడుల కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) ఒకరు మృతి చెందారు. ఇజ్రాయెల్‌లో 94 మంది స్వల్పంగా గాయపడ్డారు. యుద్ధం మొదలు కావడంతో పశ్చిమాసియాకు వేలకొద్దీ విమానాలు రద్దయ్యాయి. దేశాన్ని 1979 నుంచి పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వం నుంచి మీ దేశాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రజలు తమ తలరాతను తామ చేతుల్లోకి తీసుకునేందుకు ఈ దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. దేశం ఇటువంటి దాడులను ఉపేక్షించబోదని, దేశాన్ని రక్షించుకునే సమయం వచ్చిందని, శత్రువు సైన్యాన్ని ఎదుర్కొనే అవకాశం వచ్చిందని ఇరాన్ విదేశాంగశాఖ ప్రకటించింది. రెండు పక్షాలు సమన్వయం పాటించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. యుద్ధాన్ని విరమించి, చర్చలు జరపాలని భారతదేశం పిలుపునిచ్చింది.

**పగలే అమెరికా దాడులు..**
గతానికి భిన్నంగా ఈసారి పగటి వెలుగులోనే అమెరికా దాడులకు దిగింది. శుక్రవారం వారాంతపు సెలవు అనంతరం ఇరాన్‌లో లక్షల మంది శనివారం ఉదయం యథావిధిగా పనులకు, పాఠశాలలకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.27 గంటల సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగాయి. తొలుత సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఇళ్లు, కార్యాలయాల చుట్టుపక్కల దాడులు జరిగాయి.

....(మిగతా2లో)

## నేటి బాలలే
# రేపటి పరిశోధకులు...

2070 నాటికి భారత్ నెట్ జీరో లక్ష్యాన్ని సాధించేలా ముందుకు

గచ్చిబౌలిలో విజ్ఞాన్ వైభవ్ ఎక్స్ పోలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
యువత పరిశోధనలపై దృష్టి సారించేలా విద్యా సంస్థలు పరిశ్రమలతో భాగస్వామ్యం కావడంతో పాటు జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని, నేటి బాలలే రేపటి పరిశోధకులని కేంద్ర గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ డే వేడుకలను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ వైభవ్ 2.0 స్పేస్ ఎక్స్ పోను నిర్వహించారు.



....(మిగతా2లో)

## కాకినాడ జిల్లాలో.. భారీ విస్ఫోటనం
# ఘోర ప్రమాదం



- ..21 మంది సజీవ దహనం
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- వేట్లపాలెం సూర్య శ్రీ ఫైడ్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రం లో సంభవించిన భారీ ప్రేలుడు
- కాకినాడ జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న బాధితులు
- ఘటన స్థలంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ సహాయక చర్యలు పర్యవేక్షణ

....(మిగతా2లో)

## మార్చి 6 నుంచి
# 99 రోజుల ప్రణాళిక

- ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక పేరుతో రాష్ట్రమంతటా ప్రత్యేక కార్యక్రమం
- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు...
- పౌర సేవలను సులభతరం చేసేలా సాంకేతిక సంస్కరణలు
- సంస్కరణల కోసం సీనియర్ ఐఏఎస్ జయేశ్ ఆధ్వర్యంలో కమిటీ
- ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక
- 4న కలెక్టర్ల సమావేశంలో అందరి పనితీరుపై మాట్లాడతా
- జూన్ 2న తెలంగాణ పండుగ ఘనంగా జరుపుకోవాలి

....(మిగతా2లో)



ఈకబురు, హైదరాబాద్: ప్రజాప్రభుత్వ పథకాలు.. అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని 99 రోజుల కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని ఆదేశించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యక్రమాల షెడ్యూల్‌ను రూపొందించి, వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. ఫైళ్లలో ఉన్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ఫలితాలుగా మారాలని, ప్రజలకు పథకాల ప్రయోజనం ప్రత్యక్షంగా చేరేలా యంత్రాంగం మొత్తం ఒకే లక్ష్యంతో పనిచేయాలని చెప్పారు. ఈ 99 రోజుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌తోపాటు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అన్ని కార్యాలయాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఇందుకు ప్రతి శాఖ, ప్రతి జిల్లా, ప్రతి అధికారి మిషన్ మోడ్‌లో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# అది ముస్లిం లీగ్–మావోయిస్టు కాంగ్రెస్

- కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం
- రాజస్తాన్‌లో అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు శ్రీకారం



**ఈ-కబురు, జైపూర్/సనంద్:** విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పేసి నిరసన తెలపడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాల ఎదుట మనదేశాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి ఏ ఒక్క అవకాశాన్ని కూడా కాంగ్రెస్ వదులుకోవడం లేదని మండిపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) నేడు ముస్లింలీగ్ -మావోయిస్టు కాంగ్రెస్(ఎంఎంసీ)గా మారిందంటూ ధ్వజమెత్తారు. ముస్లిం లీగ్ వల్ల భారతదేశం ముక్కలైందని చెప్పారు. నేడు కాంగ్రెస్ కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. మావోయిస్టుల దారిలోనే నడుస్తూ దేశంపై దాడి చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ శనివారం రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో పర్యటించారు. రూ.16,600 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా జరిగే హ్యూమన్ ప్యాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. ప్రపంచ దేశాలు మన దేశం గురించి గొప్పగా మాట్లాడినప్పుడు ప్రతి భారతీయుడి హృదయం గర్వంతో ఉప్పొంగిపోతుందని అన్నారు. కానీ, కాంగ్రెస్ మాత్రం విదేశీయుల ఎదుట భారతదేశాన్ని కించపర్చడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఆ పార్టీ ఎన్నికల్లో వరుసగా ఓడిపోతూనే ఉందన్నారు.

....(మిగతా2లో)

# భూభారతి కాదు.. భూదోపిడీ .. హరీష్ రావు

**ఈ కబురు, జనగామ :**
కాంగ్రెస్ నాయకులు, అధికారుల జేబులు నింపడానికే కొత్త భూభారతి పోర్టల్ స్కామ్ వెనుక ఉన్న పెద్ద తలకాయలను కాపాడేందుకే ఆపరేటర్ల అరెస్ట్ మరిన్ని కనుగొనండి క్రీడా ఈవెంట్ టిక్కెట్లు సినిమా సమీక్షలు ప్రకటన సేవలు ధరణిని రద్దు చేసి తెచ్చిన భూ భారతితో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైంది ఈ కుంభకోణంపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో లేదా సిట్‌తో విచారణ జరిపించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు డిమాండ్ చేసారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజమెత్తారు. ధరణి మీద బురదజల్లి భూభారతి తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు..



....(మిగతా2లో)

## కేంద్రం హామీకి
# పార్లమెంటు బాధ్యత వహించదు



ఈ కబురు, దిల్లీ: చట్టాన్ని సమీక్షించడంపై కేంద్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చినా.. అందుకు పార్లమెంటు బాధ్యత వహించదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంటుకు చట్టాన్ని రూపొందించే "సంపూర్ణ స్వతంత్ర అధికారం'' ఉందని స్పష్టం చేసింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 152 చెల్లుబాటును సవాలు

....(మిగతా2లో)

# శ్రీశైలం వైపు నుంచి త్వరలో ఎస్సెల్బీసీ తవ్వకాలు

ఈకబురు, హైదరాబాద్ :
శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం (ఎస్సెల్బీసీ) నిర్మాణంలో భాగంగా త్వరలో శ్రీశైలం జలాశయం వైపు నుంచి తవ్వకాలు ప్రారంభం అవుతాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు



....(మిగతా2లో)

## అది ముస్లిం లీగ్–మావోయిస్టు కాంగ్రెస్



అది తట్టుకోలేక దేశ ప్రతిష్టను దెబ్బతీస్తూ ప్రతీకా రం తీర్చుకుంటోందని దుయ్యబట్టారు. దేశాన్ని కించపర్చడం, సైనిక దళాలను బలహీనపర్చడం కాంగ్రెస్‌కు అలవాటేనని పేర్కొన్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, పేపర్ లీక్ వార్తలు నిత్యం వచ్చేవని గుర్తుచేశారు. నేడు రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అద్భుతమైన పాలన అందిస్తోందని, ప్రజలకు ఎనలేని మేలు చేస్తోందని ప్రధాని మోదీ ప్రశంసించారు. నేడు పేపర్ లీక్‌లు లేవని, అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు.

**నేడు తిరుప్పరకుండ్రంలో మోదీ పూజలు**

ప్రధాని మోదీ శనివారం తమిళనాడులోని చెన్నైకి చేరుకున్నారు. ఆయన ఆదివారం మదురై, పుదుచ్చేరిలో పర్యటించనున్నారు. తిరుప్పరకుండ్రంలోని అరుళ్‌మిగు సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయబోతున్నారు. అలాగే పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభిస్తారు.

**గుజరాత్‌లో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం**

గుజరాత్‌లోని సనంద్‌లో మైక్రాన్ టెక్నాలజీ కంపెనీ ఆధ్వర్యంలోని సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ తన సత్తాను ఇప్పటికే నిరూపించుకుందని ఆయన చెప్పారు. అలాగే హార్డ్‌వేర్ రంగంలోనూ శరవేగంగా దూసుకెళ్తోందని, ప్రత్యేక గుర్తింపును సాధిస్తోందని తెలిపారు. అమెరికా భాగస్వామ్యంలో ఈ ప్లాంట్‌ను నిర్మించినట్లు వెల్లడించారు.

ఇరుదేశాల మధ్య బలమైన మైత్రికి ఇదొక ఉదాహరణ అని వివరించారు. ఇది ఏటీఎంపీ(అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) ప్లాంట్. భారత్‌లో ఈ తరహా ప్లాంట్లలో ఇదే మొదటిది కావడం విశేషం. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని గ్లోబల్ ఇన్వెస్టర్లకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. వ్యాపార వృద్ధికి ఇక్కడ చక్కటి అవకాశాలు ఉన్నాయని సూచించారు. దేశంలో సెమీకండక్టర్ల తయారీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. గత శతాబ్దాన్ని చమురు శాసించిందని, ఇప్పటి శతాబ్దాన్ని మైక్రోచిప్ శాసించబోతోందని తేల్చిచెప్పారు.

## భూభారతి కాదు.. భూదోపిడీ .. హరీష్ రావు

ఇప్పుడు ఆ పోర్టల్‌లో జరుగుతున్న కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. జనగామ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రకంగా భ్రష్టు పట్టించిందో రైతులను ఎలా మోసం చేస్తోందో వివరించారు. ధరణి పోర్టల్‌లో లోపాలున్నాయంటూ పదే పదే విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ తో భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పిందని, కానీ ఆ పోర్టల్ ఇప్పుడు ఖజానాకు గండి కొడుతూ దళారులకు భూ హారతిగా మారిందని దుయ్యబట్టారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పూర్తి డబ్బులు కడుతుంటే, భూ భారతి పోర్టల్ ఎడిటింగ్ ఆప్షన్ వాడుకుని కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, మిగతా 90 శాతం దళారులు జేబుల్లో వేసుకున్నారని విమర్శలు గుప్పించారు. 37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా నడుస్తుంటే, కనీసం నిఘా వ్యవస్థలకు కూడా తెలియక పోవడం ఈ ప్రభుత్వ వైఫల్యమేని చురకలంటించారు. విలేకరులు వార్తలు రాస్తే తప్ప ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి ఈ స్కామ్ గురించి సోయి లేదని, ఈ భారీ కుంభకోణం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద అధికారులు ఉన్నారని, వాళ్ల పేర్లు బయటకు రాకుండా కవర్ చేయడానికే నామమాత్రంగా ఆపరేటర్లను అరెస్ట్ చేసి కేసులు నీరుగారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడానికి కమీషన్ల మీద కమీషన్లు, సిట్ లు వేస్తున్న రేవంత్ రెడ్డి. ఈ భూ భారతి కుంభకోణంపై, ప్రభుత్వ ఖజానా లూటీపై సిట్ తో విచారణ ఎందుకు జరిపించడంలేదని ప్రశ్నించారు. దీనిపై వెంటనే సిట్ వేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టాలని డిమాండ్ చేశారు. పేలని బాంబులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి నిషేధిత భూముల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెట్టడం, వసూళ్లు కాగానే తీసేయడం ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని, నేడు ఆ జాబితా కోటి ఎకరాలు దాటిందని, హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారడం లేదని ఎద్దేవా చేశారు. అసలు నిషేధిత జాబితాలో ఎన్ని భూములు పెట్టారో వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ హయాంలో 6 లక్షల 18 వేల మంది రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సాదా బైనామాలు చేసి పాస్ బుక్‌లు ఇచ్చారని, రెండో విడత కోసం 8 లక్షల 92 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, గతంలో లేని విధంగా భూమి అమ్మిన వ్యక్తి బాండ్ పేపర్ పైన అఫిడవిట్ ఇవ్వాలని అనే కొత్త నిబంధన పెట్టి సాదా బైనామాకు ఉరితాడు బిగించారని హరీష్ రావు మండిపడ్డారు.

## శ్రీశైలం వైపు నుంచి త్వరలో ఎస్సెల్బీసీ తవ్వకాలు

శనివారం సచివాలయంలో ఇంజినీర్లు, అధికారులతో ఎస్సెల్బీసీ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ‘2025 ఫిబ్రవరిలో పైకప్పు కూలిన ప్రమాద ఘటన వంటివి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. 2028 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు 24 గంటలు మూడు షిఫ్టుల్లో పనులు జరగాలి. ఇప్పటికే దేవరకొండ వైపు తవ్వకాలు మొదలయ్యాయి. శ్రీశైలం వైపు నుంచి జాగ్రత్తలు తీసుకుంటూ పనులను చేపట్టాలి. భూభౌతిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే టీబీఎం(టన్నెల్ బోర్ మిషన్) విధానాన్ని విరమించుకున్నాం. అత్యాధునిక పరిజ్ఞానంతో తవ్వకాలు ప్రారంభించాం’ అని వివరించారు. తవ్వకాల సమయంలో అవసరమైన గాలి ప్రసరణ, ఊట నీటి తొలగింపు ఏర్పాట్లపై అధికారులు మంత్రికి వివరించారు.

## వేసవిలో వడగాలుల ముప్పు



ఈకబురు, దిల్లీ, హైదరాబాద్: ఈ సంవత్సరం వేసవిలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత అధికంగా ఉండనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. పగలు, రాత్రి వేళల్లో సాధారణం కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని శనివారం విడుదల చేసిన ‘వెదర్ ఔట్‌లుక్’లో పేర్కొంది. ‘మార్చిమే నెలల మధ్య తెలంగాణలో ఎండ తీవ్రతతోపాటు వడగాలులు వీచే రోజుల సంఖ్య పెరుగుతుంది. మార్చి నెలలో మాత్రం సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున.. వేడిగాలులు సాధారణ స్థితిలోనే నమోదవుతాయి. ఏప్రిల్ నుంచి మే నెల వరకు పగలుతోపాటు రాత్రి వేళల్లోనూ అధిక వేడి పరిస్థితులు ఉంటాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు తాగునీటి సరఫరాలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలి. వడదెబ్బ ఉదంతాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం ఆరోగ్యపరమైన నిఘా ఏర్పాటుచేయాలి’ అని ఐఎండీ సూచించింది.

దేశవ్యాప్తంగా చూస్తే.. పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తర కర్ణాటక, ఉత్తర తమిళనాడుతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వడగాలుల ప్రభావం ఉంటుందని ఐఎండీ

# నేటి బాలలే రేపటి పరిశోధకులు...




సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ఆస్ట్రోనాట్ శుభాన్షు శుక్లాతో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ వైభవ్ పేరులోనే గొప్ప సందేశం ఉందన్నారు. దేశ శక్తి సామర్థ్యాలు మన జ్ఞాన సంపదపై ఆధారపడి ఉంటాయని, ప్రాచీన కాలం నుంచే భారత మేధస్సు ప్రకృతి రహస్యాలను అన్వేషించడం, వాటిని మానవాళి శ్రేయస్సుకు ఉపయోగించే లక్ష్యాలతో ముందుకు సాగుతుందన్నారు. గత 11 ఏళ్లలో భారత్ విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో శక్తివంతంగా మారిందని, విజ్ఞాన రంగంలో భారత్ నేడు పైచేయి సాధించిన విషయం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. నేడు దేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని పిల్లర్లు శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లు, ఆవిష్కర్తల భుజాలపై ఆధారపడి ఉన్నాయన్నారు. అంతరిక్షంలోకి మనం పంపిన అనేక మిషన్లు ప్రపంచానికి ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. వికసిత భారత్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో విజ్ఞానం, సాంకేతికతే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ దూరదృష్టి, ఆయన నాయకత్వంలో భారత్ లో చారిత్రక మార్పు వచ్చిందన్నారు. పారదర్శకమైన సాంకేతిక ఆధారిత పరిపాలన అందిస్తూ 2070 నాటికి భారత్ నెట్ జీరో లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో ఉన్నామన్నారు. ఈ ప్రయాణంలో క్లీన్ ఎనర్జీ. గ్రీన్ హైడ్రోజన్, కార్బన్ క్యాప్సర్, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో ఆవిష్కరణలు అత్యంత కీలకమన్నారు. 2013లో 2,700కోట్లుగా ఉన్న సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ కేటాయింపులు 2026 నాటికి 41వేల కోట్లకు పెరిగిందన్నారు. 2014లో 10 బిలియన్ డాలర్లుగా ఉన్న బయో ఎకానమీ ప్రస్తుతం 140 బిలియన్ డాలర్లకు విస్తరించిందని తెలిపారు. నేడు భారత్ లో 6వేలకు పైగా సాంకేతిక స్టార్టప్ లు.. స్వచ్ఛ శక్తి, ఆధునిక పదార్థాలు వంటి రంగాల్లో పనిచేస్తున్నాయని అన్నాడు. మార్కెట్ అవసరాలను అందిపుచ్చుకునేందుకు ఇండియా ఏఐ మిషన్ కింద 10వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నామన్నారు. ఇందులో భాగంగా సిఐఎస్ఆర్ఐఐసిటి ప్రాంగణంలో 200కోట్ల వ్యయంతో ప్రపంచ స్థాయి సైన్స్ సిటీ నిర్మాణంలో ఉందన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు రామన్ ఎఫెక్ట్ గురించి చదివిన విషయం తనకు ఇప్పటికీ గుర్తుందని, తెలుసుకోవాలనే కుతూహలం చరిత్రను ఎంతగా మార్చగలదో రామన్ నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇస్రో, డిఆర్డిఓ ప్రతినిధులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యుద్ధ జ్వాల



శుక్రవారం వారాంతపు సెలవు అనంతరం ఇరాన్‌లో లక్షల మంది శనివారం ఉదయం యథావిధిగా పనులకు, పాఠశాలలకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.27 గంటల సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగాయి. తొలుత సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఇళ్లు, కార్యాలయాల చుట్టుపక్కల దాడులు జరిగాయి. దీంతో టెహ్రాన్ వ్యాపార కేంద్రంలోని ఖమేనీ ప్రాంగణానికి వెళ్లే దారులన్నింటినీ మూసివేశారు. ఆ తర్వాత దేశమంతా బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ సైన్యం, ప్రభుత్వ, నిఘా కార్యాలయాలపై దాడులు జరిగాయి. 8 నెలల్లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగడం ఇది రెండోసారి.

కెర్మన్‌షా, ఖోమ్, తబ్రీజ్, ఇస్ఫహాన్, ఇలాం, కరజ్ ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

ఇరాన్ హార్మోజ్‌గన్ ప్రావిన్సులోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై అమెరికా బాంబులు పడ్డాయి. ఈ ఘటనలో 86 మంది విద్యార్థినులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఈ ప్రాంతంలో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ స్థావరం ఉంది. ఉత్తర టెహ్రాన్‌లోని 30 ప్రాంతాల్లో ఒకేసారి ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ అధ్యక్ష భవనం, కీలక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే ఈ దాడులు జరిగాయి. ఆ సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని, అప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సైతం సురక్షితంగా ఉన్నట్లు టెహ్రాన్ మీడియా వెల్లడించింది.

ఖమేనీ, పెజెష్కియాన్ సురక్షితంగానే ఉన్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ధ్రువీకరించారు. అమెరికా దాడులు అక్రమమని, అన్యాయమని, రెచ్చగొట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు.

శనివారం సాయంత్రం టెహ్రాన్‌లోని నిఘా కార్యాలయం సమీపంలో 3 పేలుళ్లు సంభవించాయి.

200 యుద్ధ విమానాలతో ఇరాన్‌లోని 500 లక్ష్యాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

**తీవ్రంగా స్పందించిన ఇరాన్**

అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసిన కొద్ది గంటల తర్వాత ఇరాన్ స్పందించింది. తొలుత ఇజ్రాయెల్‌పై 200కుపైగా డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. అందులో 35 ఇజ్రాయెల్ గగనతలంలోకి ప్రవేశించాయి. ఈ దాడుల్లో 94 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆ తర్వాత బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈసహా 7 దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్, యూఏఈ, ఇరాక్‌తోపాటు పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి.

బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ దాడులు జరిపింది. మనామాలోని బహుళ అంతస్తుల భవనం మంటల్లో చిక్కుకుంది.

కువైట్‌లోని అల్ సలేం అమెరికా ఆర్మీ సెంట్రల్‌పై ఇరాన్ విరుచుకుపడింది.

ఖతార్‌లోని అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై ఇరాన్ క్షిపణులు పేల్చింది.

యూఏఈలోని అల్‌ధఫ్రా ఎయిర్‌బేస్‌పై దాడులు చేసింది. దుబాయ్‌లో గగనతల రక్షణ వ్యవస్థను మోహరించారు. బాంబు ముక్క ఒకటి పడటంతో దుబాయ్‌లో ఒకరు మరణించారు. ప్రఖ్యాత పామ్ జుమేరియా ప్రాంతంలోనిఅంతర్జాతీయ పర్యాటకుల హోటల్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు.

జోర్డాన్‌లోని కింగ్ హుసేన్ వైమానిక స్థావరాన్నీ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది.

తమ దేశంలోని రియాద్‌పై ఇరాన్ దాడులు చేయడాన్ని సౌదీ అరేబియా ఖండించింది.

ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హూతీ రెబల్స్.. ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడులకు దిగారు. ఇజ్రాయెల్‌పైనా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించారు. ఖతార్, యూఏఈ, ఇజ్రాయెల్‌లలోని అమెరికా ఎంబసీల్లో సిబ్బందిని షెల్టర్లకు వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.

**ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితి**

ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అంతటా ఎయిర్ రైడ్ సైరన్లు మోగుతున్నాయి. బంకర్లలో దాక్కోవాలంటూ ప్రజలకు ప్రభుత్వం సందేశాలను పంపుతోంది.

డజన్లకొద్దీ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్‌పై సంయుక్తంగా శక్తిమంతమైన దాడులు చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది.

**44 విమాన సర్వీసుల రద్దు**

ఇరాన్, గల్ఫ్‌లో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి అబుధాబి, కువైట్, దోహా, దుబాయ్ తదితర దేశాలకు రాకపోకలు సాగిస్తున్న 44అంతర్జాతీయ విమాన సర్వీసులను వాటి నిర్వహణ సంస్థలు రద్దు చేశాయి. శనివారం రాత్రి 8గంటల వరకు గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన 21 విమానాలు, శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన 23 విమానాలు రద్దయ్యాయి. తాము ప్రకటించే వరకు టికెట్లు బుక్ చేసుకోవద్దని ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు.

# మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక

అన్ని ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో శనివారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తానని చెప్పారు. అధికారుల పనితీరు లోపాలను సహించబోమని హెచ్చరించారు. ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక అని.. ప్రతి పథకం, ప్రతి పాలసీ విజయం, వైఫల్యం వారిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. మార్చి 4న నిర్వహించే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపై మాట్లాడతానని వెల్లడించారు.

**ఇంటి నుంచే అన్ని సేవలు పొందేలా..**

పరిపాలనలో అధునాతన సాంకేతికను సమర్థంగా వినియోగించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రజలు ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారానే అన్ని పథకాలు, సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తీసుకురావాలని నిర్దేశించారు. కరెంట్ మీటర్, ఇళ్ల నిర్మాణానికి అనుమతి, నల్లా కనెక్షన్ మొదలు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా పనులు జరగాలని చెప్పారు. వాహనం కొన్న షోరూంలోనే రిజిస్ట్రేషన్ చేసే విధానం అమల్లోకి వచ్చిందని, ఇలా ప్రతి విభాగంలోనూ సంస్కరణలు తీసుకురావాలన్నారు. ఏ ఫైలు, ఏ ఆర్జీ ఎక్కడ ఉందో దరఖాస్తుదారు తెలుసుకునే సునాయస విధానం ఉండాలని సూచించారు. సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలు అమలు చేసేందుకు ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ అధ్వర్యంలో కమిటీ వేయాలని ఆదేశించారు. మూడు వారాల్లో ని వేదికను అందజేయాలని కోరారు. ప్రతీ విభాగంలో డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలని, డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్లను వచ్చే 20 ఏళ్లకు సరిపడేలా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

**కేంద్రం సమ్మిట్‌పై విమర్శలొచ్చాయి..**

కేంద్రం నిర్వహించిన ఏఐ సమ్మిట్‌పై కొన్ని విమర్శలు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు జోన్లుగా విభజించామని గుర్తు చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ప్రతి ఐఏఎస్ అధికారి తమ శాఖలో బెస్ట్ ప్రోగ్రామ్‌ను డిజైన్ చేసుకోవాలని, తమంతట తాముగా గర్వపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

**ఉద్యోగుల డేటా సిద్ధంగా ఉండాలి..**

రెగ్యులర్ ఉద్యోగులతోపాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమాచారం అన్ని శాఖల కార్యదర్శుల వద్ద సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని ఆదేశించారు. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలని, బడ్జెట్ ప్రతిపాదనల్లో వీటిని చేర్చాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను రాబట్టుకునేందుకు ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని, నిధుల సద్వినియోగం చేపట్టడం వల్ల ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా రాష్ట్రం సాధించుకునే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఉండాలని, అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**ప్రజలు మార్పును స్వాగతిస్తున్నారు..**

పారదర్శకత, జవాబుదారీతనం, మార్పును తీసుకొస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం రెండేళ్ల మూడు నెలలు పూర్తి చేసుకుందని, ప్రజలు కోరుకున్న మార్పును స్వాగతిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వరుస ఎన్నికల్లో ప్రజలు తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని అన్నారు. ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయితీగా అంచనా వేసుకుని, ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో గుర్తించాలని అధికారులను హెచ్చరించారు. వచ్చే ఎన్నికల నాటికి మిగిలిన రెండేళ్లు తొమ్మిది నెలలకు సరైన ప్రణాళికతో కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎం సూచించారు.

## రేవంత్, యోగి ఒకటే



ఈ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. "ముస్లింల ప్రస్తావన వస్తే కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటైపోతాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ యాభై వేల మత కల్లోలాల ద్వారా ముస్లింలకు నష్టం చేసింది. బాబ్రీ మస్జిద్ కూల్చివేతకు, టాడా చట్టంతో అమాయకులను జైలుపాలు చేయడానికి కాంగ్రెస్ కారణం కాదా?" అని ప్రశ్నించారు. అయినా తాము క్షమించి మద్దతిస్తే, బీజేపీని భూచిగా చూపి కాంగ్రెస్ నేతలు ముస్లింల ఓట్లు దండుకుంటున్నారే తప్ప వారి అభివృద్ధికి పాటుపడటం లేదని విమర్శించారు. "మోదీ, యోగి, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి.. రావులందరూ ఒక్కటే. అందరూ వేషాలు మార్చి మన మధ్యకు వస్తున్నారు. వారంతా ఒక్కటై ముస్లింలపై ప్రతీకారం తీర్చుకుంటున్నారు" అని అక్బరుద్దీన్ ఆరోపించారు. వేములవాడలో 800 ఏళ్ల నాటి దర్గాను కూల్చివేశారని, ఆదిలాబాద్, బాన్సువాడ వంటి ప్రాంతాల్లో జరిగిన అల్లర్లలో నష్టపోయిన ముస్లింలకు ప్రభుత్వం ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వడం లేదని, ఇతర హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. ముస్లింలు ఇప్పటికైనా మేల్కొని, తమ కోసం పోరాడుతున్న మజ్లిస్ పార్టీకి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. తాను బతికున్నంత వరకు ప్రభుత్వాలతో రాజీలేని పోరాటం చేస్తానని అక్బరుద్దీన్ స్పష్టం చేశారు.

## కేంద్రం హామీకి
### పార్లమెంటు బాధ్యత వహించదు

చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సెక్షన్ 152 దేశ సార్వభౌమత్వం, ఏకత్వం, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు సంబంధించినది. గతంలో రద్దు చేసిన ఐపీసీలోని సెక్షన్ 124ఏ (దేశద్రోహం)ను కేంద్రం సెక్షన్ 152 ద్వారా తిరిగి ప్రవేశపెడుతోందని పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరు వాదించారు. ‘‘ఈ చట్టాన్ని ప్రభుత్వం సమీక్షించేవరకు అమలు చేయొద్దని, దీన్ని ఉపయోగిస్తూ కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయొద్దని సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం 2022 మే నెలలో పేర్కొంది. ఆ సమయంలో కేంద్రం ఆ చట్టాన్ని పునఃసమీక్షిస్తామని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది’’ అని న్యాయవాది వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ‘కేంద్రం హామీ ఇచ్చి ఉండవచ్చు. కానీ, పార్లమెంటు దానికి బాధ్యత వహించదు’ అని తెలిపింది. చట్టాన్ని రూపొందించే విషయంలో పార్లమెంటుకు సంపూర్ణ అధికారం ఉందని వ్యాఖ్యానించింది.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ వెంకటయ్య, రామస్వామి యాదవ్ తదితరులు

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి పరిధి లోని బీహెచ్ఈఎల్ టౌన్షిప్ లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో
నోబెల్ గ్రహీత, భారతరత్న సర్ సీ వి రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. కవితగారు అధ్యక్షతన
జరిగిన అవగాహన కార్యక్రమానికి హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ భౌతికశాస్త్ర ఆచార్యులు జి.వెంకటయ్య ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని భారతదేశం అంతటా సివి రామన్ సేవలకు గుర్తింపుగా విద్యాలయాలు, పరిశోధన సంస్థలు 1987 నుండి ప్రతి సంవత్సరం ఒక నినాదంతో నిర్వహించుకుంటున్నాయని అన్నారు. ఈ సంవత్సరం' విజ్ఞానశాస్త్రంలో ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం' అనే నినాదంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలలో శాస్త్రీయ అవగాహన పెంపొందించడం, యువతను శాస్త్ర సాంకేతిక రంగాలలో కెరీర్ వైపు ప్రోత్సహించడం, శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధమైన ఆలోచనలను అభివృద్ధి చేయడం, భారతదేశం యొక్క శాస్త్రీయ పురోగతిని ప్రజలకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్లను, వర్క్ షాపులను, ఉపన్యాసాలను, క్విజ్ పోటీలను, శాస్త్రీయ ప్రదర్శనలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సర్ సీవీరామన్ గొప్ప భౌతికశాస్త్ర వేత్త.అని, కాంతి పరిక్షేపం పై ఆయన చేసిన పరిశోధలకు 1930లో నోబెల్ బహుమతిని పొందారని, ఈ విభాగంలో నోబెల్ బహుమతిని పొందిన వారిలో ఆసియాలోనే మొదటి భౌతికశాస్త్రవేత్త అని అన్నారు. కేవలం 200 రూపాయల విలువైన పరికరాలతో అంతర్జాతీయ స్థాయి ప్రయోగాన్ని ఆవిష్కరించి నోబెల్ బహుమతి అందుకున్న గొప్ప భౌతికశాస్త్రవేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్య ప్రకాష్ , సైన్స్ అధ్యాపకులు డాక్టర్ అనురాధ, జ్యోతిర్మయి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రాజెక్టులను అడ్డుకోండి .. కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు

ఈ కబురు, హైదరాబాద్ ;
కృష్ణా జలాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి వివాదం రాజుకుంది. కృష్ణా బేసిన్ అవసరాలు తీర్చకుండానే ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నీటిని ఇతర బేసిన్‌లకు తరలిస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్యలను తక్షణం అడ్డుకోవాలని కోరుతూ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు తెలంగాణ ఈఎన్సీ (జనరల్) రమేశ్ బాబు లేఖ రాశారు. పెన్నా బేసిన్‌కు కృష్ణా జలాలను మళ్లించేందుకు ఏపీ ప్రభుత్వం రూ.47,776.50 కోట్లతో పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం చట్టవిరుద్ధమని తెలంగాణ తన లేఖలో పేర్కొంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకాలతో పాటు హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచి అదనంగా 114.75 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏపీ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం2014 ప్రకారం, బేసిన్‌లో



కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే కేఆర్ఎంబీ, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతితో పాటు అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి అని తెలంగాణ గుర్తుచేసింది. బచావత్ ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం కూడా బేసిన్ అవసరాలు తీరాకే నీటిని మళ్లించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను ఏపీ ఉల్లంఘిస్తోందని ఫిర్యాదులో వివరించింది. ఏపీ ఉల్లంఘనలపై 2021 నుంచి తాము ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా బోర్డు స్పందించడం లేదని, అదే సమయంలో తమ ప్రాజెక్టులపై ఏపీ చేసే ఫిర్యాదులపై మాత్రం తక్షణమే స్పందిస్తోందని తెలంగాణ ఆక్షేపించింది. తాము చేపడుతున్నవి ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులేనని, కొత్తవి కావని స్పష్టం చేసింది.

# గచ్చిబౌలిలో ఘనంగా 'విజ్ఞాన్ వైభవ్ 2.0'

**భారీగా తరలివచ్చిన స్కూల్ విద్యార్థులు**

**స్టాల్స్ లో ఆకట్టుకున్న రక్షణ, అంతరిక్ష నమూనాలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో శనివారం నిర్వహించిన విజ్ఞాన్ వైభవ్ 2.0 స్పేస్ కన్వెన్షన్, ఎక్స్‌పో ఉత్సాహంగా సాగింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆస్ట్రోనాట్ శుభాన్షు శుక్లా సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ లో దేశానికే తలమానికమైన పలు అంతరిక్ష, రక్షణ రంగ నమూనాలను ప్రదర్శించారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున హాజరై ఈ నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. ఇస్రో ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్ నమూనా, భారత హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రాం గగన్ యాన్ నమూనాలు ఆకట్టుకున్నాయి. దీంతో పాటు బిడిఎల్ అభివృద్ధి చేసిన భారత రక్షణ రంగం అమ్ములపొదిలోని ప్రధాన క్షిపణులు అస్త్ర, నాగ్. ఆకాశ్, కొండర్స్, ధ్రువాస్త్ర నమూనాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. జెన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి భారత ఎన్ఎస్జీ, కేంద్ర బలగాలకు అందజేసిన షూట్ ఎడ్జ్ వెపన్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రదర్శనలో భాగంగా అంతరిక్ష వివరాలు, పలు శాటిలైట్ల విశేషాలతో స్పేస్ ఆన్ వీల్స్ పేరుతో బస్సులో ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థులు ఉత్సాహంగా తిలకించారు. ఎక్స్ పోలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన నమూనాలను సైతం ప్రదర్శనలో ఉంచారు.


ఎక్స్ పోలో బిడిఎల్ అభివృద్ధి చేసిన క్షిపణుల నమూనాల ప్రదర్శన


ఎక్స్ పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన షూట్ ఎడ్జ్ వెపన్ తో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


ఆకట్టుకున్న గగన్ యాన్ నమూనా



ఎక్స్ పోను తిలకించేందుకు బారులు తీరిన విద్యార్థులు

# అంజయ్య నగర్ మెయిన్ రోడ్డుపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి : ఆంజనేయులు సాగర్


జోనల్ కార్యాలయం అధికారులకు పిర్యాదు చేస్తున్న ఆంజనేయులు సాగర్ తదితరులు



అంజయ్య నగర్ నాయకులతో కలిసి జోనల్ కార్యాలయంలో ఆంజనేయులు సాగర్

**కూకట్ పల్లి జోనల్ కార్యాలయం అధికారులకు వినతి**

**రోడ్డు దాటలేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని డిమాండ్**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ మెయిన్ రోడ్డుపై రోడ్డు దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అంజయ్య నగర్ మెయిన్ రోడ్డు పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఏం ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంజయ్య నగర్ ప్రధాన రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటే కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులకు శనివారం వినతి పత్రం అందజేశారు. అంజయ్య నగర్ డివిజన్ నాయకులతో కలిసి శనివారం కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులను కలిసిన ఆంజనేయులు సాగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ కొండాపూర్-గచ్చిబౌలి ప్రధాన రహదారిపై అంజయ్య నగర్ వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా కొండాపూర్ ఫ్లై ఓవర్ దిగిన వెంటనే వాహనాలు వేగంగా వస్తుండడంతో పాదచారులు రోడ్డు దాటడం ప్రాణాపాయంగా మారుతుందన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా ఈ దారిలో రద్దీ పెరిగిందని, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రహదారి దాటడం కష్టసాధ్యంగా మారిందన్నారు. వేగంగా దూసుకువస్తున్న వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోయారు. రహదారి పక్కనే ఉన్న అంజయ్య నగర్, సిద్దిక్ నగర్, బంజారా నగర్ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజువారి పనుల నిమిత్తం ప్రతిరోజూ రహదారి దాటే సమయంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టే ప్రణాళికలు ఉన్న నేపథ్యంలో, సదరు పనులతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని సైతం చేపట్టాలని కోరారు. ఒకవేళ రోడ్డు విస్తరణ పనులు ఆలస్యమైతే, ప్రజల భద్రత దృష్ట్యా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని ప్రాధాన్యత క్రమంలో అత్యవసరంగా చేపట్టి స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా కాపాడాలని అధికారులను అభ్యర్థించారు.
ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ స్థల పరిశీలన నిర్వహించి, వీలైనంత త్వరగా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి నరసింహ, సంతోష్, స్వామి, బాలపీర్ సాగర్, రాజేందర్ రెడ్డి, రాజు, గురు స్వామి, వీరేష్, విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో.. భారీ విస్ఫోటనం ఘోర ప్రమాదం

(ఈకబురు,, కాకినాడ జిల్లా ప్రతినిధి)
కాకినాడ జిల్లాలో మందు గుండు తయారీ కేంద్రంలో భారీ ప్రేలుడు సంభవించింది. ఈ ఘటన ఒక్కసారిగా రాష్ట్రంలో అలజడి కలిగించింది. జిల్లాలోని సామర్లకోట మండలంలోని వేట్లపాలెం పరిధిలో గోదావరి కాలువ సమీపంలో ఉన్న సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ బాణసంచా తయారీ యూనిట్‌లో శనివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఆకస్మికంగా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. భారీగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్ముకుంది. ఘటనా స్థలంలో మృత దేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ప్రమాద సమయంలో 35 మంది వరకు అక్క పనిచేస్తున్నారని సమాచారం. పేలుడు తీవ్రత దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని స్థానికులు తెలిపారు. శబ్ద ప్రభావంతో సమీప గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాల భవన స్లాబ్‌లో పగుళ్లు ఏర్పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రులకు తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది.బాణసంచా పరిశ్రమను అడపానాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ఇప్పటి వరకు 11 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.పేలుడు సంభవించిన సమయంలో భారీ శబ్దం రావడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారికీ అక్కడి పరిస్థితి హృదయ విదారకంగా కనిపించింది. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో గుర్తింపు ప్రక్రియ సవాలుగా మారింది. స్థానికుల కథనం ప్రకారం, పరిమితికి మించి బాణసంచా తయారీ జరగడం ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఘటనకు గల అసలు కారణాలపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

--ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి..

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా ప్రేలుడు ప్రియుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హుటాహుటిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో పర్యటిస్తున్న ఆయనకు ప్రమాద సమాచారం అందడంతో, అక్కడ నుంచే ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఏమిటి, సంఘటన స్థలంలో సహాయక చర్యలు ఎలా కొనసాగుతున్నాయనే అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఘటన సమయంలో సూర్య ఫైర్ వర్క్స్‌లో సుమారు 20 మంది వరకు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో బాణసంచా తయారీదారులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా, కాకినాడలో జరిగిన పేలుడు ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం విషాదకరమని పేర్కొంటూ, కార్మికుల మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేసి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పేలుడు ప్రభావంతో చుట్టుపక్కల ఇళ్లు దెబ్బతినడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

--రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులు..

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో సంభవించిన ఘోర బాణసంచా పేలుడు ఘటన యావత్ రాష్ట్రాన్ని కన్నీటిపర్యంతం చేస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాల ఆశలు, ఆ గాలిలోనే కలిసిపోయాయి. కళ్లముందే కన్నవారు, కట్టుకున్న వారు అగ్నికీలల్లో ఆహుతైపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆ గ్రామం విలవిలలాడుతోంది. సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం మధ్యాహ్నం వరకు అంతా మామూలుగానే ఉంది. కానీ, ఒక్కసారిగా సంభవించిన బాణసంచా పేలుడు ఆ ప్రాంతాన్ని యుద్ధ క్షేత్రంగా మార్చేసింది. పేలుడు ధాటికి గ్రామమంతా వణికిపోయింది, ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. దట్టమైన పొగలు, మంటల మధ్య కార్మికుల ఆర్తనాదాలు మిన్నంటాయి. దురదృష్టవశాత్తు ఇప్పటి వరకు మృతుల సంఖ్య 23కి చేరింది. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరికొందరు ప్రాణాలు వదలడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇంకా నలుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

--బురద పొలాలు.. అందని సహాయక చర్యలు

ఈ ప్రమాదంలో ప్రకృతి కూడా బాధితులను వెక్కిరించింది. బాణసంచా తయారీ కేంద్రం జనవాసాలకు దూరంగా, వరి పొలాల మధ్య ఉండటంతో, ప్రమాదం జరిగిన వెంటనే ఫైరింజన్లు, అంబులెన్సులు అక్కడికి చేరుకోలేకపోయాయి. పొలాలు బురదమయంగా ఉండటంతో వాహనాలు ఇరుక్కుపోయాయి. దాదాపు రెండు గంటల పాటు బాణసంచా పేలుళ్లు కొనసాగుతూనే ఉండటంతో, ప్రాణాలు కాపాడేందుకు స్థానికులు కూడా వెళ్లలేకపోయారు. చివరకు వెళ్లేసరికి, అక్కడ శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్న భీతావహ దృశ్యం ప్రతి ఒక్కరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఆరు షెడ్లలో బాణసంచా తయారీ జరుగుతోంది. ఈ పరిశ్రమకు లైసెన్స్ ఉన్నప్పటికీ, రక్షణ చర్యలు మాత్రం శూన్యమని స్థానికులు మండిపడుతున్నారు. పేలుడు సంభవించిన వెంటనే యజమాని పరారీలో ఉన్నట్లు ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. కొంతమంది కార్మికులు భోజనం కోసం బయటకు వెళ్లడం వల్ల ప్రాణాలతో బయటపడ్డారు. లేదంటే మృతుల సంఖ్య మరింత భయంకరంగా ఉండేదని తెలుస్తోంది.ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో చావుబతుకుల మధ్య పోరాడుతున్న వారిలో వేట్లపాలెం వాసి కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె. శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. వీరి కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రి ప్రాంగణంలో గుండెలను పిండేస్తున్నాయి.

--కాకినాడకు ముఖ్యమంత్రి చంద్రబాబు..

విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ వార్త వినగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే తన పర్యటనను ముగించుకుని కాకినాడకు బయలుదేరారు. ఆయన స్వయంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనంతరం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించనున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

--మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పేలుళ్లకు కారణాలపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. కాకినాడ జిల్లాలో బాణసంచా పరిశ్రమలో పేలుడు మరణించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేట్లపాలెం వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందారని తెలిసి ఆవేదనకు గురయ్యానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.



# ఫండ్ విలువలపై ఇన్ఫోసిస్ షేరు సెగ

**ఈనెలలో 20% పతనం , గత 13 ఏళ్లలో ఇదే పేలవ ప్రదర్శన , ఏఐ ఆందోళనలు నేపథ్యం**




దేశీయ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ షేరు, దశాబ్దకాలంలోనే అత్యంత పేలవ ప్రదర్శనను ఈ నెలలో కనబర్చింది. ఫిబ్రవరిలో ఈ షేరు విలువ 20.75% క్షీణించింది. 2013 ఏప్రిల్‌లో షేరు విలువ 22.75% పతనమయ్యాక.. ఒక నెలలో ఇన్ఫీ షేరు మళ్లీ ఇంతగా నష్టపోవడం ఇప్పుడే. 52 వారాల గరిష్ఠమైన రూ.1,775 (2025 ఫిబ్రవరి 27)తో పోల్చితే, ప్రస్తుతం షేరు ధర 26.3% క్షీణించింది. ఈ ఏడాది జనవరి 30న బీఎస్ఈలో ఇన్ఫీ షేరు రూ.1640.45 వద్ద ఉండగా.. ఫిబ్రవరి 27న రూ.1299.95 వద్ద ముగిసింది. ఈ నెలలో లార్జ్ క్యాప్ కంపెనీల విభాగంలో అత్యధిక నష్టాన్ని చవిచూసిన కంపెనీల షేర్లలో ఇదీ ఒకటి. కృత్రిమ మేధ ఆందోళనల కారణంగా ఇన్ఫోసిస్‌తో పాటు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ వంటి దేశీయ దిగ్గజ ఐటీ కంపెనీల షేర్లు ఈనెలలో భారీగానే నష్టపోయాయి. ఫిబ్రవరిలో ఇన్ఫీ షేరు భారీగా నష్టపోవడంతో, ఈ నెలలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,33,824 కోట్ల మేర తగ్గి, రూ.5,27,087 కోట్లకు పరిమితమైంది.

**ఫండ్‌లకూ నష్టాల సెగ...** దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు ప్రాధాన్యమిచ్చే షేర్లలో ఇన్ఫోసిస్ కూడా ఒకటి. అందుకే ఈ కంపెనీ షేర్లలో ఇవి పెట్టుబడులు కూడా అధికంగా పెడుతూ వచ్చాయి. ఇప్పుడు ఇన్ఫీ షేరు నష్టాలబాట పట్టడంతో ఆ సెగ దేశీయ మ్యూచువల్ ఫండ్‌లకూ తాకింది. డిసెంబరు చివరికి 45 మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కలిపి, ఇన్ఫోసిస్‌లో మొత్తంగా 22.12% వాటా ఉంది. 2024 డిసెంబరు ఆఖరుతో పోలిస్తే ఇది 2.07% ఎక్కువ. 52 వారాల గరిష్ఠమైన రూ.1,775 నుంచి షేరు 26.3 శాతం పడటంతో దేశీయ మ్యూచువల్ ఫండ్‌ల వాటాల విలువ రూ.1,59,223 కోట్ల నుంచి రూ.1,17,331 కోట్లకు దిగివచ్చింది. అంటే రూ.41,892 కోట్ల నష్టం (నోషనల్ లాస్) వాటిల్లింది.

**ఇదే కారణం..** టెక్ రంగ షేర్లకు అత్యంత అధ్వాన నెలల్లో ఒకటిగా ఈ ఫిబ్రవరి నిలిచిపోతుంది. ఆంత్రోపిక్ నుంచి మరింత అడ్వాన్స్‌డ్ ఏఐ (కృత్రిమమేధ) టూల్స్ వస్తుండటంతో.. 300 బిలియన్ డాలర్ల భారత ఐటీ సేవల పరిశ్రమపై ప్రభావం పడొచ్చన్న ఆందోళనలు ఇందుకు కారణం. ఏఐ వల్ల అప్లికేషన్ సేవల ఆదాయాలను కంపెనీలు కోల్పోవడం ప్రారంభమైతే.. దేశీయ ఐటీ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవచ్చని బ్రోకరేజీ సంస్థల హెచ్చరించడం కూడా మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసింది. ఐటీ కంపెనీల మొత్తం ఆదాయాల్లో అప్లికేషన్ సేవల ఆదాయాలు 4070% వరకు ఉండటమే ఇందుకు కారణం. ఫిబ్రవరిలో నిఫ్టీ ఐటీ సూచీ కూడా 19.13% కుదేలైంది. తద్వారా 2023 నవంబరు నాటి కనిష్ఠ స్థాయికి దిగివచ్చింది.

**ఎఫ్‌పీఐలూ వెనకడుగు..**

భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) ఇప్పుడిప్పుడే సానుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. ఐటీ షేర్లలో మాత్రం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఫిబ్రవరి తొలి అర్ధభాగంలో ఐటీ కంపెనీల షేర్ల నుంచి రూ.11,000 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఐటీ రంగ షేర్లలో ఎఫ్‌పీఐల మొత్తం పెట్టుబడుల విలువ 2026 ఫిబ్రవరి 15 నాటికి రూ.4,48,938 కోట్లకు పరిమితమైంది. ఎన్ఎస్‌డీఎల్ గణాంకాల ప్రకారం.. గత నాలుగేళ్లలోనే ఇది కనిష్ఠ స్థాయి. ఈ ఏడాది జనవరి చివరికి దేశీయ టెక్ కంపెనీల షేర్లలో ఎఫ్‌పీఐల పెట్టుబడుల విలువ రూ.5,33,953 కోట్లుగా ఉంది.

# రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.7,536 కోట్లు, డీఐఐ కొనుగోళ్లు: రూ.12,293 కోట్లు**

దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు పోటెత్తాయి. అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా స్టాక్‌మార్కెట్లను ఏఐ, ద్రవ్యోల్బణ భయాలు నష్టపరచిన నేపథ్యంలో, అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా మారడం ఇందుకు నేపథ్యం. విదేశీ మదుపర్ల అమ్మకాలూ తోడయ్యాయి. ఫలితంగా మన సూచీలు అధికంగా నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 17 పైసలు తగ్గి 91.08 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.26% లాభంతో 71.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.4.98 లక్షల కోట్లు తగ్గి రూ.463.50 లక్షల కోట్ల (5.10 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 28 పాయింట్ల (క్రితం ముగింపు 82,248.61) నష్టంతో 82,220.48 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు వెల్లువెత్తడంతో రోజంతా నష్టాల్లోనే ట్రేడైన సూచీ, ఒకదశలో 81,159.15 పాయింట్లకు చేరింది. చివరకు 961.42 పాయింట్ల నష్టంతో 81,287.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 317.90 పాయింట్లు క్షీణించి 25,178.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,141.30 25,476.40 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 25 కుదేలయ్యాయి. సన్‌ఫార్మా 2.61%, భారతీ ఎయిర్‌టెల్ 2.53%, ఎం అండ్ ఎం 2.42%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.38%, ఇండిగో 2.32%, మారుతీ 2.26%, కోటక్ బ్యాంక్ 2.18%, అల్ట్రాటెక్ 1.96%, అదానీ పోర్ట్స్ 1.92%, హెచ్‌యూఎల్ 1.90%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.85%, బజాజ్ ఫైనాన్స్ 1.60% నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ 1.22% వరకు లాభపడ్డాయి. గాడియం ఐవీఎఫ్ షేరుకు లాభాలు: గాడియం ఐవీఎఫ్ అండ్ ఉమెన్ హెల్త్ షేరు ఇష్యూ ధర రూ.79తో పోలిస్తే, బీఎస్ఈలో 5% లాభంతో రూ.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.87.15 వద్ద గరిష్ఠాన్ని తాకి, 1.87% లాభంతో రూ.80.48 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.585.79 కోట్లుగా నమోదైంది. విశాల్ మెగా మార్ట్‌లో 13.96% వాటాను రూ.7,635 కోట్లకు ప్రమోటరు అయిన సమాయత్ సర్వీసెస్ విక్రయించింది. ఈ లావాదేవీ అనంతరం విశాల్ మెగా మార్ట్‌లో సమాయత్ సర్వీసెస్ వాటా 54.09% శాతం నుంచి 40.13 శాతానికి తగ్గింది.



**తగ్గిన ఫారెక్స్ నిల్వలు..** మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు ఫిబ్రవరి 20తో ముగిసిన వారానికి 2.119 బి.డాలర్లు (దాదాపు రూ.19,000 కోట్లు) తగ్గి 723.608 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.65.10 లక్షల కోట్ల)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 8.663 బి.డాలర్లు అధికమై జీవనకాల గరిష్ఠమైన 725.727 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.039 బి.డాలర్లు తగ్గి 572.564 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 977 మి.డాలర్లు క్షీణించి 127.489 బి.డాలర్లుగా ఉన్నాయి.

# బొగ్గు దిగుమతులు 30% తగ్గించుకోండి

**విద్యుత్ ప్లాంట్లకు కేంద్రం సూచన**

బొగ్గు దిగుమతులను కనీసం 30% తగ్గించుకోవాలని విద్యుత్‌ప్లాంట్లకు కేంద్రం సూచించింది. దేశీయ బొగ్గు కలిపి వాడడాన్ని (బ్లెండింగ్) పెంచడం ద్వారా, ఈ ఏడాది కనీసం 15 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతిని నిలువరించవచ్చని భావిస్తోంది. ఈ ప్రణాళికతో దగ్గరి సంబంధాలున్న ప్రభుత్వ, పరిశ్రమ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద థర్మల్ బొగ్గు దిగుమతిదారుగా మనదేశం ఉంది. 2025లో ఇండొనేషియా, దక్షిణాఫ్రికా, రష్యా వంటి దేశాల నుంచి వచ్చిన 50 మిలియన్ టన్నుల బొగ్గును మనదేశంలోని విద్యుత్ ప్లాంట్లు వినియోగించాయి. ఈ ఏడాది 15 మి. టన్నుల మేర బొగ్గు దిగుమతుల్లో కోత వేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. దేశంలో నాలుగింట మూడొంతుల విద్యుదుత్పత్తికి బొగ్గుపైనే జరుగుతోంది. దేశీయంగా నాణ్యమైన బొగ్గు లభిస్తున్నందున, ఇబ్బందులేమీ ఉండవని విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం వివరిస్తున్నట్లు సమాచారం. వేసవి కోసం బొగ్గు సరఫరా పెంపు..కోల్ ఇండియా: వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుంది కాబట్టి, అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెంచే పనిలో ఉన్నట్లు కోల్ ఇండియా తెలిపింది. ఈనెల 25 నాటికి కంపెనీ వద్ద 115 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. మార్చి 31 నాటికి ఇది మరింత పెరగనుంది. విద్యుత్ ప్లాంట్ల వద్ద 55 మి. టన్నుల బొగ్గు సహా ఇతరత్రా గూడ్స్ షెడ్లు, వాషరీలు, పోర్టులతో కలిపి మొత్తం 175.5 మి.టన్నుల నిల్వలున్నాయి. విద్యుత్ ప్లాంట్లకు వేసవి నెలల్లో అధిక పరిమాణంలో బొగ్గు అవసరం ఉంటుంది.

# ‘జీడీపీ’ గణాంకాలు మారాయ్

**2025--26కు వృద్ధి అంచనా 7.6%**
**అక్టోబరు-డిసెంబరులో వృద్ధి 7.8 శాతానికి**
**కొత్త సిరీస్ అమలు నేపథ్యం**

మనదేశం అమల్లోకి తెచ్చిన కొత్త జీడీపీ సిరీస్ కారణంగా వృద్ధిరేటు అంచనాలు, వృద్ధి గణాంకాల్లో మార్పులొచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాను అంతక్రితం అంచనా అయిన 7.4% నుంచి 7.6 శాతానికి సవరించారు. లెక్కింపు పద్ధతులను ప్రభుత్వం సవరించడం ఇందుకు నేపథ్యం. ప్రాతిపదిక ఏడాదిని 2011-12 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరానికి మార్చారు. దీంతోపాటు జీఎస్టీ, ఇవాహన్ పోర్టల్ నుంచి అదనపు గణాంకాలను జత చేయడం ద్వారా, ఆర్థిక కార్యకలాపాలను మెరుగ్గా ప్రతిబింబించేలా కొత్త సిరీస్ తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. గణాంక, పథకాల అమలు శాఖ (మోస్పి) ‘న్యూ సిరీస్ ఆఫ్ యాన్యువల్ అండ్ క్వార్టర్లీ నేషనల్ అకౌంట్స్ ఎస్టిమేట్స్’ను విడుదల చేసింది. అంతక్రితం ఉన్న పాత సిరీస్‌ను ఇది భర్తీ చేసింది. జీడీపీ సిరీస్‌కు ఇది తొమ్మిదో ప్రాతిపదిక సవరణ. దీని ప్రకారం..2025-26 మూడో (అక్టోబరుడిసెంబరు) త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతానికి చేరింది. 2024-25 ఇదే సమయంలో ఇది 7.4%. తయారీ, సేవల రంగాలు రాణించడం ఇందుకు కలిసొచ్చింది. రెండో త్రైమాసిక (జులైసెప్టెంబరు) వృద్ధి రేటు పాత సిరీస్‌లోని 8.2% నుంచి 8.4 శాతానికి చేరింది. తొలి త్రైమాసికంలో మాత్రం 7.8% నుంచి 6.7 శాతానికి తగ్గింది. ఈ మార్పుల కారణంగా 202526 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ (స్థిర ధరల వద్ద) రూ.322.58 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. 2024-25లో తొలి సవరించిన అంచనా (ఎఫ్ఆర్ఈ) రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. దీంతో 202526లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.6% అవుతుందని అంచనా. 2024 25లో ఇది 7.1%. 2025-26 నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 8.6 శాతానికి చేరొచ్చు. 2026-27కు వృద్ధి అంచనా పెంపు

**సీఈఏ నాగేశ్వరన్ వెల్లడి...** జీడీపీ కొత్త సిరీస్ నేపథ్యంలో, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (202627) వృద్ధిరేటు అంచనాలను 20 బేసిస్ పాయింట్లు పెంచి 77.4% చేసినట్లు ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. పార్లమెంటుకు జనవరిలో సమర్పించిన ఆర్థిక సర్వే ప్రకారం ఇది 6.87.2%. నామినల్ జీడీపీ వృద్ధి రేటు 11 శాతానికి చేరువవుతుందని, ఆర్థిక వ్యవస్థ అపుడు సౌకర్యవంతంగా 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.360 లక్షల కోట్లు) స్థాయిని అధిగమించగలదని అంచనా వేశారు.




**ద్రవ్యలోటు రూ.9.8 లక్షల కోట్లు....** జనవరి చివరకు కేంద్ర ద్రవ్యలోటు రూ.9.8 లక్షల కోట్లుగా నమోదైంది. 202526 వార్షిక బడ్జెట్ లక్ష్యంలో 63 శాతానికి ఇది సమానం. 202425 ఇదే సమయానికి బడ్జెట్ లక్ష్యంలో 74.5 శాతంగా నమోదైంది. 202526లో ద్రవ్యలోటును జీడీపీలో 4.4 శాతం (రూ.15.58 లక్షల కోట్లు)గా కేంద్రం అంచనా వేసింది.


# సిమ్ లేకుంటే వాట్సప్ బంద్.. 1 నుంచి ఈ రైల్వే యాప్ క్లోజ్!

ప్రతినెలా క్యాలెండర్ మారడంతో పాటు ఆర్థికపరంగా కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ముఖ్యం. అలా మార్చి ఒకటి నుంచి కొన్ని మార్పులు రాబోతున్నాయి. సిమ్ బైండింగ్, యూపీఐకి సంబంధించిన రూల్స్ ఈ జాబితాలో ఉన్నాయి. వాట్సప్ బంద్: వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్‌నకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. మార్చి 1 నుంచి ఈ రూల్స్ అమల్లోకి రానున్నాయి. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఆయా యాప్‌లను వెబ్‌బ్రౌజర్‌లో ఉపయోగిస్తే ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. సైబర్ మోసాలను అరికట్టే ఉద్దేశంతో ఈ రూల్స్ తీసుకొచ్చింది. యూటీఎస్ సేవలు నిలిపివేత: జనరల్ టికెట్లు, ప్లాట్‌ఫామ్ టికెట్ల బుకింగ్ కోసం రైల్వే శాఖ గతంలో తీసుకొచ్చిన యూటీఎస్ యాప్ మార్చి 1 నుంచి నిలిచిపోనుంది. ఈ సేవలన్నీ రైల్వే శాఖ కొత్తగా తీసుకొచ్చిన రైల్‌వన్ యాప్‌లో లభ్యమవుతాయి. యూటీఎస్ ఆర్‌వాలెట్‌లోని నగదు ఉంటే రైల్‌వన్ యాప్‌నకు బదిలీ అవుతుంది. యూపీఐకి బయోమెట్రిక్: యూపీఐ చెల్లింపులు మరింత సురక్షితం కానున్నాయి. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపేటప్పుడు పిన్‌తో పాటు బ్యాంకులు అదనంగా బయోమెట్రిక్ లేదా ఇతర ఆథరైజేషన్‌ను అడగనున్నాయి. దీంతో మోసాలను అరికట్టొచ్చు. 1600 సిరీస్: బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ వినియోగదారులకు చేసే ఫోన్‌కాల్స్ ‘1600 సిరీస్’ నంబరును వినియోగించాలని ట్రాయ్ స్పష్టంచేసింది. బ్యాంకులు ఇప్పటికే దీన్ని అమలు చేస్తున్నాయి. మార్చి 1 నుంచి ఎన్‌బీఎఫ్‌సీలు, మార్చి 15 నుంచి స్టాక్‌బ్రోకర్ల నుంచి వచ్చే కాల్స్ కూడా ఈ సిరీస్ నుంచే రానున్నాయి. బ్యాంకుల పేరిట సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను అరికట్టేందుకు ట్రాయ్ ఈ నిర్ణయం తీసుకుంది.




# పబ్లిక్ ఇష్యూకు భారత్ బయోటెక్

**రూ.4500 కోట్ల ఐపీఓకు అవకాశం, చర్చలు ప్రాథమిక దశలోనే: బ్లూమ్‌బర్గ్**




హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే వ్యాక్సిన్ తయారీ కంపెనీ భారత్ బయోటెక్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4500 కోట్లు) మేర నిధులను సమీకరించాలన్నది సంస్థ యోచనగా, ఈ అంశాలతో దగ్గరి సంబంధమున్న వ్యక్తులు చెప్పారని ఆంగ్ల వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇదే జరిగితే ఇటీవల దేశీయ బయోటెక్నాలజీ రంగంలో వచ్చిన అతిపెద్ద ఐపీఓల్లో ఇది ఒకటి అవుతుంది. ఐపీఓపై అంతర్గత చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఆ కథనం వెల్లడించింది. కంపెనీ ఈ విషయంపై అధికారిక ప్రకటన చేయలేదు.

**100కు పైగా దేశాల్లో..** కొవిడ్19 పరిణామాల్లో సొంతంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి, ప్రపంచానికి అందించిన ఈ సంస్థ, భారీ పరిమాణంలో ఐపీఓకు వస్తే అది ఒక మైలురాయి కానుంది. 1996లో స్థాపించిన ఈ కంపెనీ హెపటైటిస్ బి, టైఫాయిడ్, రోటావైరస్, ఇన్‌ఫ్లుయెంజా వంటి వివిధ వ్యాధుల నిరోధానికి భారీ స్థాయిలో వ్యాక్సిన్లు, బయోథెరప్యూటిక్స్‌ను అందిస్తోంది. కొన్నేళ్లుగా తన తయారీ, పరిశోధన సామర్థ్యాలను విస్తరిస్తూ వస్తోంది. వందకు పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయడం ద్వారా అంతర్జాతీయ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్స్‌లో కీలక సంస్థగా అవతరించింది.

**తదుపరి తరం వ్యాక్సిన్‌ల అభివృద్ధి వేగవంతం..** ఐపీఓ ద్వారా సేకరించే నిధులను పరిశోధనఅభివృద్ధి (ఆర్ అండ్ డీ)ని విస్తరించడానికి, తయారీ మౌలిక వసతులను పెంచుకోవడానికి, తదుపరి తరం వ్యాక్సిన్లు, బయోలాజిక్స్ అభివృద్ధిని వేగవంతం చేయడానికి భారత్ బయోటెక్ ఉపయోగించుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లినికల్ ట్రయల్స్, నియంత్రణ అనుమతులు, అంతర్జాతీయ పంపిణీ నెట్‌వర్క్‌ల నిమిత్తం ఫార్మా కంపెనీలకు భారీ స్థాయిలో నిధుల అవసరం ఉంటోంది.

**ఇతర కంపెనీల లిస్టింగ్‌కూ దారి..** ఒక వేళ ప్రతిపాదిత 500 మి. డాలర్ల ఇష్యూ జరిగి, విజయవంతమైతే వినూత్నతపై ఆధారపడే ఆరోగ్య సంరక్షణ కంపెనీలపై మదుపర్ల విశ్వాసం కొనసాగడంతో పాటు, ఇతర పరిశోధన సంస్థలకూ ఈ ఐపీఓ దారి చూపినట్లవుతుంది.

**ధర, సమయం కీలకం..** రికార్డు స్థాయి నిధుల సమీకరణ అనంతరం, ప్రస్తుతం దేశీయ ఐపీఓ మార్కెట్ స్తబ్దుగా ఉంది. ఈ సమయంలో భారత్ బయోటెక్ ఇష్యూ వార్తలు రావడం విశేషం. ఆరోగ్యసంరక్షణ, ఫార్మాపై మదుపర్ల ఆసక్తి ఎపుడూ బలంగానే ఉంటుంది. అయితే ఈక్విటీ మార్కెట్లో ఊగిసలాటలు, ఎఫ్ఐఐల అప్రమత్త ధోరణి నేపథ్యంలో, ఇష్యూ ధర, సమయంపై కంపెనీలు ఆచితూచి అడుగేస్తున్నాయి.


# భౌగోళిక ఉద్రిక్తతలు.. భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు



బంగారం ధరలు మరోసారి భగ్గుమన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజే సుమారు రూ.7 వేలు పెరిగి రూ.1,73,500కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,650కి చేరుకుంది. కిలో వెండి ధర రూ.2,99,000 పలుకుతోంది. అమెరికాఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం, వెండివైపు పెట్టుబడులు మళ్లించడం వీటి ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణిలో బంగారం ఔన్సు ధర 5,296 డాలర్లు పలుకుతుండగా.. వెండి ఔన్సు 93.82 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# అమెరికా పరిణామాలను గమనిస్తున్నాం

**కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్**



టారిఫ్‌లపై అమెరికా సుప్రీం కోర్టు తీర్పు అనంతరం, అగ్రరాజ్య పరిణామాలను గమనిస్తున్నట్లు వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. తీర్పు తర్వాత వాణిజ్య ఒప్పందం చర్చల విషయంలో భారత ధోరణి మారుతుందా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ ‘అమెరికాతో కలిసి తుదిరూపునిచ్చిన సంయుక్త ప్రకటనను మీరు చూసే ఉంటారు. ఏవైనా పరిస్థితుల్లో మార్పులు ఉంటే, ఒప్పందం కూడా అందుకు తగ్గట్లే మారుతుందని అందులో ఉంది. ఇరు వర్గాలూ ఒప్పంద సమతౌల్యం కోసమే చూస్తాయ’ని అన్నారు. సంయుక్త ప్రకటన రెండు దేశాలకూ ప్రయోజనాన్నే అందించగలదని వివరించారు. 150 రోజుల వ్యవధికి ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 10% టారిఫ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 24న ప్రకటించి, తదుపరి ఆమొత్తాన్ని 15 శాతానికి పెంచుతున్నట్లు తెలిపారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత వస్తువులపై సుంకాన్ని 50% నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అంతక్రితం ప్రకటించింది. డెయిరీ, సోయామీల్, పౌల్ట్రీ, జీఎమ్ ఆహారం, బియ్యం, గోధుమలు, మొక్కజొన్న వంటి అంశాల్లో మన రైతులకు పూర్తి రక్షణ ఉందని గోయల్ పేర్కొన్నారు.

# ఏఐ ముప్పు లేని ఉద్యోగాలున్నాయ్

**డబ్బు కంటే అభిరుచే ముఖ్యం... జోహో సీఈఓ శ్రీధర్ వెంబు**



కృత్రిమ మేధ (ఏఐ) వల్ల, పలు రంగాల్లో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే ఏఐ ముప్పు దరిచేరని ఉద్యోగాలూ చాలానే ఉన్న విషయాన్ని గుర్తించాలని జోహో వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీధర్ వెంబు తెలిపారు. డబ్బు కంటే అభిరుచి ప్రాధాన్యంగా అవి ఉండటం వల్ల, ఏఐ ముప్పు వాటిని తాకలేదని ‘ఎక్స్’ పోస్ట్‌లో ఆయన తెలిపారు. పిల్లలువృద్ధుల సంరక్షణ, బోధన, నచ్చిన విభాగంలో వ్యవసాయం, అడవుల సంరక్షణ, దేవాలయాల ఆచారాలు, శాస్త్రీయ సంగీతం లాంటి వాటిని ఏఐ తాకలేదని ఆయన చెప్పారు. మానవత్వం అనే అంశమే ఈ పనుల ఉద్దేశాలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని వెల్లడించారు. భిన్నాభిప్రాయాలు: వెంబు చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నచ్చిన అభిరుచి ఉన్న పనిలో నిలదొక్కుకోవడంతో పాటు బతికేందుకు నిధులూ అవసరమని ఒకరు బదులిచ్చారు. తగినంత సంపద ఉంటేనే కళ అయినా, సంస్కృతి అయినా అభివృద్ధి చెందుతుందని వాదించారు. దీనిపై వెంబు స్పందిస్తూ డబ్బు కోణంలో నుంచి బయటికి రావాలని విమర్శకులను కోరారు. ‘ఏఐ, దాని సంబంధిత సాంకేతికతలతో వస్తువులు, సేవల ఉత్పాదకత పెరుగుతుంది. అయితే తగినంత ఉద్యోగాలు, ఆదాయాలు సృష్టించకపోతే.. ఆ వస్తువులు, సేవలను ప్రజలు వినియోగించుకోగలరా? అన్నదే అసలైన సవాలు’ అని ఆయన వివరించారు. పూర్వకాలంలో దేవాలయాలపై శిల్పాలు చెక్కే కళాకారులకు, వాళ్లు జీవనం గడిపేందుకు అవసరమైన ధాన్యం, వస్తువులను మాత్రమే ఇచ్చేవాళ్లని.. ఇప్పుడులా వేతనాలు ఇచ్చేవాళ్లు కాదని గుర్తుచేశారు. తగిన ఉపాధి లేకుండా, సాంకేతికత ద్వారా ఉత్పాదకతను పెంచితే.. ఆ మిగులు ఉత్పాదకతను సమాజానికి పంచేందుకు రాజకీయ, ఆర్థిక పరిష్కారాలు అవసరం అవుతాయని వెంబు అన్నారు. నగరాల పునర్నిర్మాణం దగ్గర నుంచి, జీవన నాణ్యత మెరుగుపర్చడం వరకు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వీలు కల్పించడం ద్వారా కొత్త రకాల ఉద్యోగాలను ఏఐ సృష్టిస్తుందని వెంబు పోస్ట్‌పై మరొకరు వ్యాఖ్య చేశారు.

## గ్లింప్స్ తో వస్తున్న ఉస్తాద్



‘ఉస్తాద్ భగత్ సింగ్’గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి వస్తున్న నేపథ్యంలో ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తోంది చిత్ర బృందం. దీనిలో భాగంగా త్వరలో 40సెకన్ల నిడివితో ఓ పవర్‌ప్యాక్డ్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌తో ఆ విషయాన్ని ప్రకటించారు. ఈ చిత్ర స్థాయి, తీవ్రత, మాస్ అంశాల్ని ఈ ప్రచార చిత్రంతో ప్రేక్షకులకు చూపించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పవన్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.




## విరోష్ జోడి.. పెళ్లి వీడియోతో సర్‌ప్రైజ్ ఇచ్చిన ‘రణబాలి’ టీమ్..

నిన్నటివరకూ వెడ్డింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేసిన విజయ్ దేవరకొండ, రష్మిక.. ఇప్పుడు కొత్త సినిమా (Ranabaali) లుక్స్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. విజయ్ ప్రధాన పాత్రలో రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రానున్న చిత్రం ‘రణబాలి’. ఇందులో విజయ్‌కు జోడీగా రష్మిక (Rashmika) నటిస్తున్నారు. తాజాగా వీరి లుక్స్‌ను విడుదల చేస్తూ ఓ వీడియోను పంచుకున్నారు. చిత్రంలో విజయ్, రష్మికల పెళ్లి పాటకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేస్తూ ఈ కొత్త జంటకు విషెస్ తెలిపారు. ‘ఏందయ్యాసామీ..’ అంటూ సాగే ఈ పాటలో వీరిద్దరి కెమిస్ట్రీ మరోసారి వెండితెరపై మేజిక్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోందని అభిమానులు అంటున్నారు. ఈ చిత్రంలో విజయ్ (Vijay Deverakonda) రణబాలి పాత్రలో కనిపిస్తుండగా రష్మిక జయమ్మగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 11న ఈ చిత్రం విడుదల కానుంది.

**ముచ్చటగా మూడోసారి..**

విజయ్, రష్మిక ‘గీత గోవిందం’లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. దీని తర్వాత ‘డియర్ కామ్రేడ్’తో అలరించారు. ఈ చిత్రం కమర్షియల్‌గా హిట్ కాకపోయినప్పటికీ యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. ఇప్పుడు మూడుముళ్ల బంధంతో ఒక్కటైన తరువాత వీరిద్దరూ కనిపించనున్న సినిమా ‘రణబాలి’. దీంతో ఈ సినిమాపై ఆసక్తి రెట్టింపైంది.

ఇండియాలోనే రికార్డు సృష్టించిన ఫొటో..

వారం రోజులుగా విజయ్, రష్మిక పేర్లు నిత్యం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. వీళ్లిద్దరూ ఎప్పుడెప్పుడు పెళ్లి పీటలెక్కుతారా అని ఎదురుచూసిన అభిమానుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడడంతో వీరి పెళ్లి ఫొటోలు రికార్డును సృష్టించాయి. రష్మిక షేర్ చేసిన ఫొటోలకు ఏకంగా 23 మిలియన్‌లకు పైగా లైక్స్ వచ్చాయి. ఇండియాలోనే అత్యధిక లైక్స్ వచ్చిన ఇన్‌స్టా పోస్ట్‌గా చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకూ విరాట్ పేరుమీద ఉన్న రికార్డును బ్రేక్ చేసినట్లైంది. టీ 20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత విరాట్ షేర్ చేసిన ఫొటోలకు 22.9 మిలియన్ల లైక్స్ వచ్చాయి. వీటి తర్వాత ఐపీఎల్ గెలిచినప్పుడు కోహ్లీ పెట్టిన పోస్ట్‌కు 19.8 లైక్స్ వచ్చాయి. ఈ రెండిటినీ విరోష్ జోడీ ఫొటో అధిగమించి మొదటి స్థానంలో నిలిచింది.

## హిందీ అగ్ర హీరో సరసన మీనాక్షి?



తెలుగులో అగ్రకథానాయకులతోపాటు యువ హీరోల సరసన నటిస్తూ వరుస విజయాలతో జోరుమీదుంది హీరోయిన్ మీనాక్షి చౌదరి. ముగ్గుల పండక్కి ‘అనగనగా ఒక రాజు’ సినిమాలో చారులతగా కనిపించి.. ఈ ఏడాదిని మంచి విజయంతో ఆరంభించిందీ భామ. తాజాగా ఆమె బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్‌తో జంట కట్టనుందట. ప్రియదర్శన్ దర్శకత్వంలో 2006లో విడుదలైన కామెడీ థ్రిల్లర్ ‘భాగమ్ భాగ్’ సినిమా సీక్వెల్‌లో ఆమె కనిపించనుందని బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

“ప్రియదర్శన్ ప్రస్తుతం అక్షయ్‌కి సంబంధించిన మూడు చిత్రాలను తెరకెక్కించే పనిలో బిజీగా ఉన్నారు. ఇప్పుడాయన రూపొందిచాలనుకున్న ‘భాగమ్ భాగ్’ సీక్వెల్ బాధ్యతల్ని రాజ్ శాండిల్యకు అప్పగించారు. అక్షయ్ హీరోగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో మీనాక్షి చౌదరి, ‘ధురంధర్’ సినిమాలో ప్రత్యేక గీతంలో అలరించిన ఆయేషా ఖాన్‌ను కథానాయికలుగా నటించనున్నార”ని హిందీ చిత్రవర్గాల సమాచారం. మీనాక్షి ప్రస్తుతం హీరో నాగచైతన్య నటిస్తున్న ‘వృషకర్మ’ సినిమాతో బిజీగా ఉంది.

## పవర్‌ఫుల్ పాత్రలో మోహన్ బాబు.. లుక్ రిలీజ్

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా ‘శ్రీనివాస మంగాపురం’ (Srinivasa సీనియర్ నటుడు మోహన్‌బాబు నటిం వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా చేసింది. ఇందులో ఆయన (Mohan కనిపించనున్నట్లు తెలిపింది. ఇది ది. ప్రేమకథా చిత్రంగా రానున్న ఈ థడానీ నటిస్తున్నారు. వాస్తవికతకు హత్తుకునే ప్రేమకథలా దీన్ని రూపొం ఇక నాని హీరోగా రానున్న ‘ది ప్యార చనున్న విషయం తెలిసిందే. ఇందులో పాత్రలో నటిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల రూపొందుతోంది. తెలుగు, తమిళ, మొత్తం 8 భాషల్లో ఈ సినిమా ప్రేక్ష



అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం Mangapuram). ఈ సినిమాలో చనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు ఆయన లుక్‌ను చిత్రబృందం విడుదల babu) వెంకటప్పయ్య నాయుడుగా సినిమాకు కీలకమైన పాత్రగా తెలుస్తోం సినిమాలో జయకృష్ణకు జోడీగా రషా పెద్దపీట వేస్తూ భావోద్వేగాలతో మనసుల్ని దించనున్నట్లు దర్శకుడు తెలిపారు. డైజ్’లో మోహన్‌బాబు విలన్‌గా కనిపిం ఆయన ‘శికంజ మాలిక్’ అనే విలన్ దర్శకత్వంలో భారీ స్థాయిలో ఈ చిత్రం కన్నడ, మలయాళ, బెంగాలీతో పాటు.. కుల ముందుకురానుంది.

## మైసూర్‌లో నాగార్జున యాక్షన్



కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రా. కార్తీక్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్‌తో ముస్తాబవుతున్న ఈ సినిమాని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా మైసూర్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకుందని సమాచారం. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో నాగ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారని తెలిసింది. యాక్షన్ ప్రధానంగా సాగే ఆసక్తికర కథతో రూపొందుతున్న చిత్రమిది. ఇందులో నాగ్ కనిపించే తీరు చాలా కొత్తగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇది ఈ ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## కౌంట్‌డౌన్ మొదలు.. ‘ధురంధర్: ది రివెంజ్’ ఈసారి ఐదు భాషల్లో..

రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh) కథానాయకుడిగా ఆదిత్యధర్ (Aditya Dhar) దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్’. గతేడాది విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. కేవలం హిందీలో మాత్రమే విడుదలైనా కాసుల వర్షాన్ని కురిపించింది. ఆ మూవీకి కొనసాగింపుగా ‘ధురంధర్2: ది రివెంజ్’ (Dhurandhar: The Revenge) ఇప్పటికే సిద్ధమైన సంగతి తెలిసిందే. తొలి భాగంతో పోలిస్తే, ఈసారి యాక్షన్ థ్రిల్ డబుల్ ఉంటాయని ప్రచార చిత్రాలు చెబుతున్నాయి. హిందీతో పాటు, దక్షిణాది భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ‘ధురంధర్2’ రానుంది. ఈ సందర్భంగా ఈ విషయాన్ని మరోసారి ధ్రువీకరిస్తూ ప్రొడక్షన్ హౌస్ జియో స్టూడియో పోస్ట్‌ను పంచుకుంది. ‘‘ది రివెంజ్’కు కౌంట్ డౌన్ మొదలైంది’’ అని పేర్కొంది. మరోవైపు ఈ మూవీ రన్‌టైమ్‌పై ప్రస్తుతం ఆసక్తికర చర్చ నడుస్తోంది. ‘ధురంధర్ 2: ది రివెంజ్’ నిడివి 3 గంటల 40 (Dhurandhar 2 runtime) నిమిషాలకు లాక్ చేశారట. మొదటి భాగం 3 గంటలా 34 నిమిషాలతో పోలిస్తే కాస్త ఎక్కువే. ఇంటర్వెల్‌తో కలుపుకొంటే దాదాపు నాలుగు గంటలు సమయం ప్రేక్షకుడు థియేటర్‌లో ఉండాలి. మరి సినిమాలో అంత బలమైన కంటెంట్ ఉందా? అంటే ఈ విషయంలో ఆదిత్య ధర్ ఏ మాత్రం వెనక్కి తగ్గేదిలే లేదంటున్నారట. నాలుగు గంటల రన్‌టైమ్ ఫైనల్ కట్‌ను సిద్ధం చేసి, స్వల్ప మార్పులతో 3 గంటలా 40 నిమిషాల ఫుటేజ్‌ను సెన్సార్‌కు పంపారట. మరి సెన్సార్ కట్స్ చెబుతుందా? లేదా అన్నది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాలి. ఇక ‘ధురంధర్2’ మార్చి 19న థియేటర్స్‌లో సందడి చేయనుంది.

# ‘ది కేరళ స్టోరీ 2’.. వివాదాల నడుమ విడుదలైన మూవీ ఎలా ఉంది?

చిత్రం: ది కేరళ స్టోరీ 2: తదుపరి కథ; నటీనటులు: ఉల్కా గుప్త, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా, సుమిత్ గహ్లావత్, అర్జున్ సింగ్, యుక్త ఖోస్లా తదితరులు; రచన: విపుల్ అమృతల్ షా, అమర్‌నాథ్ ఝా; దర్శకత్వం: కామాఖ్య నారాయణ్ సింగ్

విడుదలకు ముందే వివాదాలతో సహవాసం చేసే చిత్రాలెన్నో. ‘ది కేరళ స్టోరీ 2: తదుపరి కథ’ కూడా అలాంటిదే. విడుదల ఆపాలంటూ ఒక్కరోజు ముందు కేరళ హైకోర్టు స్టే ఇచ్చింది. ఆ మరుసటి రోజు డివిజన్ బెంచ్ విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా శుక్రవారం సెకండ్ షోలతో థియేటర్లలో విడుదలైంది ఈ చిత్రం. మరి తొలిభాగం ‘కేరళ స్టోరీ’ తరహాలోనే ఇందులోనూ వివాదాంశాలు ఉన్నాయా? అసలు ఈసారి దర్శకుడు ఎంచుకున్న కథాంశం ఏంటి?

కథేంటంటే..

The Kerala Story 2 Story || స్వతంత్ర భావాలు కలిగిన నేటితరం అమ్మాయిలు సురేఖ (ఉల్కా గుప్త), దివ్య (అదితి భాటియా), నేహా (ఐశ్వర్య ఓజా). కేరళకు చెందిన సురేఖ యూపీఎస్సీకి సిద్ధమవుతూ ఉంటుంది. జర్నలిస్ట్ సలీమ్ (సుమిత్ గహ్లావత్)తో ఏర్పడిన పరిచయం లివింగ్ ఇన్ రిలేషన్‌కు దారితీస్తుంది. దివ్యకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణించాలని కోరిక. లైక్‌లు, షేర్‌ల కోసం ఆమె చేసే వెకిలి డ్యాన్స్‌లను తల్లిదండ్రులు ప్రోత్సహించరు. అదే సమయంలో పరిచయమైన రషీద్ (యుక్తమ్) ఆమెను ప్రేమిస్తున్నానని చెబుతూ, జీవితంలో అన్ని విషయాల్లో అండగా ఉంటానంటూ భరోసా ఇస్తాడు. ఇక జావెలెన్ త్రో రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తూ జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంటుంది నేహా. ప్రేమ పేరుతో ఆమెను తనవైపు తిప్పుకొని, దిల్లీలో ప్రఖ్యాత శిక్షకుడితో ట్రైనింగ్ ఇప్పిస్తానని మాయమాటలు చెబుతాడు రాజు అలియాస్ ఫైజన్. ఇలా ముగ్గురు అమ్మాయిలు తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టి ప్రేమించిన వారితో వెళ్లిన తర్వాత ఏం జరిగింది? రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక వాళ్లు తీసుకున్న నిర్ణయం ఏంటి? అన్నది చిత్ర కథ.

ఎలా ఉందంటే..

the kerala story 2 review || అమ్మాయిలకు మాయమాటలు చెప్పి మతం మార్చి, విదేశాలకు పంపే కథతో ‘కేరళ స్టోరీ’ని తీర్చిదిద్దారు. అప్పట్లో ఆ మూవీ సృష్టించిన వివాదం అంతాఇంతా కాదు. ఇప్పుడు ఆ తరహా కథతో వచ్చిన చిత్రమే ‘ది కేరళ స్టోరీ2: తదుపరి కథ’. ప్రచార చిత్రాలతోనే అసలు కథేంటో దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ప్రేమ పేరుతో అమాయక యువతులను వంచించి మతం ఎలా మారుస్తున్నారు? మాట వినకపోతే, వాళ్లను ఎన్ని చిత్ర హింసలకు గురి చేస్తారు? అప్పటివరకూ “నీ స్వేచ్ఛకు, నీ కలలకు తోడుగా ఉంటానని నమ్మబలికి మతం మారాక, ఇవన్నీ చేయడం ‘ఇక్కడ పాపం’’ అంటూ వారి కలల్ని సమాధి చేసిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ‘ది కేరళ స్టోరీ2’ను తీర్చిదిద్దినట్లు దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ చెప్పారు. నేటి యువత పెడధోరణులను ఎత్తి చూపుతూ తల్లిదండ్రుల మాటలను లెక్క చేయనితనం వల్ల ఎదురయ్యే భయానక పరిస్థితులను ఈ చిత్రం ద్వారా కళ్లకు కట్టారు. అయితే, సినిమా చూపించినట్లు మొత్తం పరిస్థితి అలాగే ఉందా? అంటే చాలా సన్నివేశాల్లో క్రియేటివ్ లిబర్టీ ఎక్కువే తీసుకున్నట్లు అనిపిస్తుంది. దీంతో కొంత వాస్తవం.. కొంత కల్పితం కలిపి ‘కేరళ స్టోరీ 2’ను వండి వార్చినట్లు అర్థం చేసుకోవచ్చు.

ఇది మూడు వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు యువతల జీవితాల సమాహారంగా దర్శకుడు కథను ఆవిష్కరించాడు. ముగ్గురు యువతుల కలల్ని, ఆశయాలను తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న నమ్మకాన్ని చూపిస్తూ ఆరంభ సన్నివేశాలు సాగుతాయి. ముగ్గురి లవ్‌స్టోరీలను సమాంతరంగా చూపించుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం బాగుంది. ముఖ్యంగా జెన్‌జీ తరం తీసుకుంటున్న తొందరపాటు నిర్ణయాల ఫలితం ఎలా ఉంటుందో కళ్లకు కట్టారు. చదువుకున్న యువతులు కూడా తియ్యని మాటలకు ఎలా ట్రాప్‌లో పడతారో తీర్చిదిద్దిన సన్నివేశాలతో ప్రథమార్ధం సాగుతుంది. కథను ఎస్టాబ్లిష్ చేసే క్రమంలో సన్నివేశాలను కొంచెం సాగదీశారేమో అనిపిస్తుంది. తాము ప్రేమించింది గోముఖ వ్యాఘ్రాలను అని ముగ్గురు యువతులు తెలుసుకునే సన్నివేశాలతో విరామం ఇచ్చిన తీరు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచింది.

అసలు విషయం తెలిసిపోయిన తర్వాత ద్వితీయార్ధం ఎలా ఉంటుందా? అని ఎదురుచూసిన ప్రేక్షకుడికి ఒళ్లు గగుర్పొడిచే సన్నివేశాలు తెరపై కనిపిస్తూ ఉంటాయి. తమకు ఎదురుచెప్పిన, మాట వినని యువతలను ఎలాంటి చిత్ర హింసలకు గురిచేస్తారు? డబ్బు కోసం ఎంతటి దారుణాలకు ఒడిగాడతారో చూపించిన తీరు చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. వావివరసలు మరిచి, సగటు మహిళలని కూడా చూడకుండా సలీమ్, ఫైజన్, రషీద్ ఇళ్లల్లో సాగే అకృత్యాలు ప్రేక్షకుడి గుండెను బరువెక్కిస్తాయి. సురేఖ, దివ్యల పాత్రలను ముగించిన తీరు భావోద్వేగానికి గురిచేస్తుంది. ఆ నరకకూపం నుంచి బయటపడిన నేహా పోలీసులను ఆశ్రయించడంతో కథలో ఒక్కసారిగా వేగం వస్తుంది. ఆ ముగ్గురు యువకులతో పాటు వారి కుటుంబాలకు పోలీసులు ఇచ్చే ట్రీట్‌మెంట్, బుల్డోజర్ న్యాయం వంటి సన్నివేశాలకు సగటు ప్రేక్షకుడు ఇట్టే కనెక్ట్ అవుతాడు. కొంతమంది యువతులకు జరిగిన అన్యాయాన్ని బ్యాలెన్స్ చేసే క్రమంలో దర్శకుడు మరీ స్వేచ్ఛ తీసుకున్నాడేమో అనిపిస్తుంది. మూడు ప్రాంతాల్లో జరిగే కథకు ‘ది కేరళ స్టోరీ2’ అని ఎందుకు పెట్టారో కూడా అర్థం కాలేదు.

ఎవరెలా చేశారంటే..

the kerala story 2 cast || బాధిత మహిళలుగా ఉల్కా గుప్త, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా గుండెలకు హత్తుకునేలా నటించారు. ముఖ్యంగా నేహా పాత్ర భావోద్వేగానికి గురిచేస్తుంది. ఇక అమ్మాయిలను ట్రాప్ చేసే యువకుల పాత్రల్లో సుమిత్ గహ్లావత్, అర్జున్ సింగ్, యుక్త ఖోస్లా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. తెరపై వారు కర్కశంగా కనిపించబట్టే ఆయా సన్నివేశాలు హైలైట్ అయ్యాయి. సాంకేతికంగా సినిమా బాగుంది. రచయితలు విపుల్ అమృతల్ షా, అమర్‌నాథ్ కొన్ని వాస్తవ సంఘటనలు తీసుకొని, దానికి తమదైన భాష్యం రాశారు. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు కాస్త అతిగా అనిపిస్తాయి. మేకవన్నె పులులు అన్ని వర్గాల్లోనూ ఉన్నారు. దర్శకుడు కామాఖ్య నారాయణ్ కథను ఒక కోణం నుంచే చూపించడం అన్ని వర్గాలకు నచ్చకపోవచ్చు.




‘అబ్దుల్ కలాం లాంటి వారు, ఆస్కార్ సంగీత దర్శకులు, గాయకులు, గొప్ప సినిమా స్టార్‌లను చూసి ఈ దేశం గర్వపడుతుంది’ అనే డైలాగ్‌తో బ్యాలెన్స్ చేసే ప్రయత్నం చేశారు. ఏది ఏమైనా నేటి జెన్‌జీ యువత పడుతున్న పెడధోరణులకు అద్దంపట్టేలా తీర్చిదిద్దిన సన్నివేశాలు మాత్రం ఒక హెచ్చరిక.

**రివ్యూ:**

బలాలు
+ నటీనటులు
+ కథాంశం
+ ద్వితీయార్ధం, క్లైమాక్స్

బలహీనతలు
ఒక కోణం నుంచే కథను నడపడం
కాస్త సినిమాటిక్ లిబర్టీ

చివరిగా: నేటి యువతకు హెచ్చరిక ‘ది కేరళ స్టోరీ 2’

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

## పాకిస్థాన్ ఇంటికి.. న్యూజిలాండ్ సెమీస్‌కి



టీ20 ప్రపంచ కప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించింది. గ్రూప్2 నుంచి రెండో సెమీస్ బెర్తును న్యూజిలాండ్ కైవసం చేసుకుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ సెమీఫైనల్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. శ్రీలంకతో మ్యాచ్‌లో పాకిస్థాన్ 213 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, శ్రీలంకను 147 పరుగులు లేదా అంతకంటే తక్కువకు కట్టడి చేసి విజయం సాధిస్తేనే పాక్ సెమీస్‌కు చేరేది. కానీ, శ్రీలంక 15.5 ఓవర్లలో 148 పరుగులు చేసింది. దీంతో పాక్ ఇంటిముఖం పట్టింది.

న్యూజిలాండ్ 3 పాయింట్లు, +1.390 నెట్‌రన్‌రేట్‌తో సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. ఇందులో విజయం సాధించినా సరే తక్కువ నెట్‌రన్‌రేట్‌తో పాక్ నిష్క్రమణ తప్పదు. తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికాతో కివీస్ మార్చి 4న తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ఈడెన్ గార్డెన్స్ వేదిక.

## శ్రీలంకపై గెలుపు.. అయినా పాక్ ఇంటికే




టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో పాకిస్థాన్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో గెలిచినా పాక్ సెమీస్‌కు అర్హత సాధించలేకపోయింది. పాకిస్థాన్ కంటే మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో న్యూజిలాండ్ ముందంజ వేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. శ్రీలంకను 147 లేదా అంతకంటే తక్కువ పరుగులకు కట్టడి చేసి విజయం సాధిస్తే పాకిస్థాన్ సెమీస్‌కు వెళ్లేది. శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. చివర్లో దాసున్ శనక (76*; 31 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్స్‌లు) చెలరేగినా లంకకు ఓటమి తప్పలేదు. పవన్ రత్ననాయకే (58; 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. ఆఖరి ఓవర్‌లో లంక విజయానికి 28 పరుగులు అవసరం కాగా.. తొలి నాలుగు బంతులకు శనక వరుసగా 4, 6, 6, 6 బాదేశాడు. చివరి రెండు బాల్స్ డాట్ కావడంతో పాక్ గెలిచింది.

## ప్రతి ఒక్కరి భద్రత మాకు ముఖ్యమే .. ఐసీసీ కీలక ప్రకటన




అమెరికా ఇరాన్ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐసీసీ కీలక చర్యలు చేపట్టింది. విమాన ప్రయాణాలకు సంబంధించి పలు దేశాలు ఇప్పటికే తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో టీ20 ప్రపంచ కప్ కోసం వచ్చిన క్రికెటర్లు, సిబ్బంది, అభిమానులను తమ స్వస్థలాలకు క్షేమంగా చేర్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో పొట్టి కప్ జరుగుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సూపర్ 8 చివరి దశలో ఉంది.

అంతర్జాతీయంగా 20 జట్లు బరిలోకి దిగాయి. ఇప్పటికే 12 జట్ల ప్లేయర్లు, సిబ్బంది, అభిమానులు తిరుగుముఖం పట్టారు. ‘‘మెగా టోర్నీతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి భద్రత మాకు ముఖ్యమే. ఇప్పటికే ట్రావెల్, లాజిస్టిక్స్, సెక్యూరిటీ టీమ్‌లను సిద్ధం చేశాం. ప్రతి ఒక్కరిని వారి ఇంటికి సురక్షితంగా చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. టీ20 ప్రపంచ కప్ కోసం వచ్చిన, రావాలనుకొనే అభిమానులకు ప్రయాణం విషయంలో కీలక విజ్ఞప్తి చేస్తున్నాం. అంతర్జాతీయ ప్రయాణం పెట్టుకున్నప్పుడు మేమిచ్చే సలహాలను నిశితంగా పరిశీలించండి. ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పాటించేందుకు ప్రయత్నించండి’’ అని ఐసీసీ ఓ ప్రకటన జారీ చేసింది.

## శ్రీకాంత్ పరాజయం



ముల్హీమ్ అన్ డెర్ రుర్: జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబిశ్రీకాంత్ 14-21, 9-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. 32 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్‌లో 9-2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. రెండో గేమ్‌లో మాత్రం ఆరంభం నుంచే చైనీస్ తైపీ ప్లేయర్ ఆధిపత్యం చలాయించాడు. తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-12, 21-11తో జిమానవ్‌స్కీ (పోలాండ్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక, తస్నిమ్ మీర్, రక్షిత శ్రీ, తన్వీ శర్మ, ఇషారాణి బారువా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు.

## విండీస్ ‘హిట్టింగ్’కు చెక్‌పెడితే..

# భారత్‌కు సెమీస్ బెర్తు ఖాయమే

**టీ20 ప్రపంచ కప్ 2026లో సెమీస్‌కు వెళ్లాలంటే ఒకే ఒక్క అడ్డంకిని టీమ్‌ఇండియా అధిగమించాలి. ఇక్కడ నెట్‌రన్‌రేట్‌తో పనేలేదు. విజయం సాధిస్తే చాలు.. సెమీస్ బెర్తు ఖాయం. ప్రత్యర్థి విండీస్ పరిస్థితి ఇంతే. తొలి బంతి నుంచే భారీ షాట్లతో విరుచుకుపడే ‘బ్యాటింగ్’ లైనప్‌తో భారత స్టార్ ‘బౌలర్ల’ మధ్య పోరు రసవత్తరంగా ఉండటం ఖాయం.**

పొట్టికప్ సూపర్ 8లో భారత్, వెస్టిండీస్ తమ చివరి మ్యాచ్‌లో తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. కోల్‌కతా వేదికగా మ్యాచ్ జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే వార్తలు వచ్చాయి. ఒకవైపు భారత బ్యాటర్లకు పని సులువైనప్పటికీ.. పేసర్లు, స్పిన్నర్లకు మాత్రం కఠిన సవాలు తప్పదు. విండీస్ జట్టులో దూకుడుగా ఆడే బ్యాటర్లకు కొదవేం లేదు. ఈ టీ20 ప్రపంచ కప్‌లో ఎక్కువ సిక్స్‌లు కొట్టిన జట్టు విండీస్. మొత్తం 66 సిక్స్‌లను ఆ జట్టు బ్యాటర్లు బాదారు. ఒకరి తర్వాత మరొకరు హిట్టింగ్ చేసేందుకే మొగ్గు చూపిస్తారు. హమ్మయ్య.. ఈ బ్యాటర్ ఔటయ్యాడని సంబరపడేలోగా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడే స్టార్లు విండీస్ సొంతం. చివరి మ్యాచ్‌లో గెలవడం మనకెంత ముఖ్యమో.. వారికీ అంతే.

**ఇదీ వారి బలం..**

మన సత్తాపైనే ఫోకస్ పెట్టడంలో తప్పులేదు. కానీ, అవతలి జట్టు బలంపైనా ఓ కన్నేయాలి. ఎవరు ఏ స్టైల్‌లో ఆడతారు? ఎవరిని ఎలా పెవిలియన్‌కు చేర్చాలి? అనేదానిపై కసరత్తు చేస్తేనే విజయం సిద్ధిస్తుంది. వెస్టిండీస్ జట్టులో షిమ్రోన్ హెట్‌మయెర్ వికెట్ అత్యంత కీలకం. అలాగని మిగతా బ్యాటర్లు తక్కువని అర్థం కాదు. ఓపెనర్లు షై హోప్, బ్రాండన్ కింగ్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫానె రూథర్‌ఫోర్డ్, రొమారియో షెఫర్డ్, జాసన్ హోల్డర్.. ఇలా తొమ్మిదో నంబర్ వరకూ వారి జోరు కొనసాగుతుంది. ఐపీఎల్‌లో ఆడటంతో వీరిందరికి భారత పిచ్‌లు ఎలా స్పందిస్తాయో బాగా తెలుసు. వచ్చామా..? భారీషాట్లు కొట్టామా? అనే స్థాయిలోనే వీరి హిట్టింగ్ ఉంటుంది. హెట్‌మయెర్ (17 సిక్స్‌లు), రూథర్‌ఫోర్డ్ (12 సిక్స్‌లు) అత్యధిక సిక్సర్ల జాబితాలో ముందున్నారు.







టీమ్‌ఇండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నుంచి అద్భుతమైన స్పెల్ రావాలి. వరుణ్ చక్రవర్తి తనకు అచ్చొచ్చిన ‘ఈడెన్ గార్డెన్స్’లో చెలరేగితే టీమ్‌ఇండియాకు తిరుగుండదు. అర్ష్‌దీప్, హార్దిక్ పాండ్య పదునైన బౌలింగ్‌తో విండీస్ హిట్టింగ్‌కు చెక్ పెడితే విజయంతోపాటు సెమీస్ బెర్తు భారత్‌దే అవుతుంది.

**బౌలింగ్‌లోనూ..**

పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే నేపథ్యంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్‌తోపాటు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, హార్దిక్, శివమ్ దూబె నుంచి మెరుపు ఇన్నింగ్స్‌లు రావాలి. ‘జింబాబ్వే’పై ఆడిన తరహాలో బౌండరీల వర్షం కురిపించాలి. విండీస్ బౌలర్లలో షమార్ జోసెఫ్, మోతీ, రొమారియో షెఫర్డ్, జాసన్ హోల్డర్, అకీల్ హుసేన్ నుంచి ప్రతిఘటన ఎదరయ్యే అవకాశం ఉంది. అయితే, వెస్టిండీస్‌పై ప్రపంచ కప్ టోర్నీల్లో భారత్‌దే ఆధిపత్యం కావడం మనకు సానుకూలాంశం.

**ప్రధాన పోటీ ఆసక్తికరం..**

విండీస్ ఓపెనర్లు vs అర్ష్‌దీప్
హెట్‌మయెర్ vs జస్‌ప్రీత్ బుమ్రా
విండీస్ మిడిలార్డర్ vs వరుణ్ చక్రవర్తిఅక్షర్ పటేల్
రొమారియో షెఫర్డ్ vs హార్దిక్ పాండ్య
అభిషేక్ శర్మ సంజు శాంసన్ vs మోతీ
ఇషాన్ కిషన్ vs షమార్ జోసెఫ్

చివరిగా: భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఇరు జట్లూ సూపర్ 8లో దక్షిణాఫ్రికా చేతిలోనే ఓటమిపాలయ్యాయి. జింబాబ్వేపై 250+ స్కోర్లను నమోదు చేయడం గమనార్హం. గ్రూప్ స్టేజ్‌లోనూ అగ్ర స్థానం సాధించి మరీ ఇక్కడికి వచ్చాయి.

# ఆటలో మెరుగులు దిద్ది.. మాటలతో స్ఫూర్తిని నింపి..!



**జమ్మూ కశ్మీర్ చరిత్ర సృష్టించింది. 1959-1960లో రంజీ ట్రోఫీలోకి అరంగేట్రం చేసిన ఆ జట్టు మొదటిసారి ఫైనల్‌కు చేరి విజేతగా నిలవడం గమనార్హం. అయితే, ఈ ‘టైటిల్’ రావడం వెనుక కఠిన శ్రమ ఉంది. ఈ స్థాయికి చేరుకోవడం ఒక్క రోజులో సాధ్యం కాలేదు. ఇటుకా.. ఇటుకా పేర్చితే సాకారమైన విజయం. అపూర్వ విజయం వెనక హెడ్ కోచ్ అజయ్ శర్మ కీలకపాత్ర పోషించారు.**



**‘ఇది నాకు పునర్జన్మ’.....**

జమ్మూకశ్మీర్ జట్టు దూకుడు.. హెడ్ కోచ్‌గా అజయ్ శర్మ వచ్చిన తర్వాత పూర్తిగా మారింది. అందరూ గౌరవంగా ‘అజ్జూ బాయ్’ అని పిలుస్తారు. జట్టుతో అతడికి ఎంతటి అనుబంధం ఉందంటే.. ‘ఇది నాకు పునర్జన్మ’ అని బెంగాల్‌పై ఆరు వికెట్ల తేడాతో నెగ్గి జమ్మూకశ్మీర్ రంజీ ఫైనల్స్‌కు అర్హత సాధించిన అనంతరం అన్నారు. బీసీసీఐ (BCCI) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ జమ్మూకశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా ఉన్నప్పుడు అజయ్‌ను కోచ్‌గా ఆహ్వానించారు. అయితే మొదట ఆయన ఆ ఆఫర్‌ను తిరస్కరించారు.

**పట్టువదలని మిథున్ మన్హాస్..!**

మిథున్ మన్హాస్ పట్టు వదలకుండా అజయ్ శర్మను ఒప్పించారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో జమ్మూకశ్మీర్ అద్భుత ప్రదర్శన చేయడం తనకు చూడాలని ఉందని తన ఆశయాన్ని వెల్లడించాడు. దీంతో ఆఖరుకు అజయ్ శర్మ అంగీకరించారు. అయితే మొదటి సీజన్‌లో అతడికి చేదు అనుభవాలే ఎదురయ్యాయి. ఆయన కోచింగ్‌పై ఫీడ్‌బ్యాక్‌లో ప్రతికూలంగా రాశారు. 20 మంది క్రికెటర్లలో కేవలం ఒకరిద్దరు మాత్రమే ఆయనకు అనుకూలంగా స్పందించారు.

**భార్య మాటతో..** క్రికెటర్లతో కోచింగ్ విషయంలో కాస్త కఠినంగా ఉన్న అజయ్ శర్మ తన భార్య మాటతో మారారు. ‘ఆ క్రికెటర్లంతా మన కుమారులకన్నా చిన్నవారు. వారిని మీ కాలంనాటి క్రికెటర్లతో పోల్చడం ఆపండి’ అని ఆమె సలహా ఇచ్చారు. అలాగే మిథున్ మన్హాస్ కూడా క్రికెటర్లతో కాస్త సౌమ్యంగా ఉండమని అజయ్‌కు సూచించారు. దీంతో శర్మలో మార్పు వచ్చింది.

**విదర్భపై విజయంతో..** క్రమంగా ఆటగాళ్లు కూడా అజయ్ శర్మకు అనుకూలంగా మారారు. అదే సమయంలో 2022 డిసెంబర్‌లో నాగ్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో విదర్భపై జమ్మూకశ్మీర్ జట్టు విజయం సాధించింది. దీంతో ఆటగాళ్లలో గెలవాలన్న కాంక్ష మరింత పెరిగింది. బౌలింగ్ కోచ్ పి. కృష్ణకుమార్, ఫీల్డింగ్ కోచ్ దిశాంత్ యాగ్నిక్.. అజయ్ శర్మ బాటలోనే నడిచారు. తర్వాత మధ్యప్రదేశ్, ఢిల్లీ, ముంబయిపై సాధించిన విజయాలు జమ్మూకశ్మీర్ ఆటగాళ్లలో విశ్వాసాన్ని నింపాయి. ప్రత్యర్థుల వేదికలపైనే ఆ జట్లను చిత్తు చేయడం గమనార్హం.

**ఫైనల్‌కు ముందు ఒక్క సందేశం..** కర్ణాటకతో ఫైనల్ మ్యాచ్‌కు ముందు అజయ్ శర్మ జమ్మూకశ్మీర్ ఆటగాళ్లకు కేవలం ఒకే ఒక్క మాట చెప్పారు. ‘మీరు గెలిస్తే చరిత్ర సృష్టించిన వారవుతారు. రన్నరప్‌గా నిలిస్తే జనాలు మిమ్మల్ని చాలా త్వరగా మరిచిపోతారు’ అని అజయ్ శర్మ అన్నారు. ఈ మాటలు జమ్మూకశ్మీర్ క్రీడాకారుల్లో... క్రాళ్లలో గెలవాలన్న పట్టుదలను పెంచాయి.

**బిషన్ సింగ్ బేడీ ముందు చూపు..**

జమ్మూకశ్మీర్ క్రికెట్‌లో ఈ రోజు ఇది సాధించిందంటే దానికి టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ ముందుచూపే కారణం. ఆయన 2011లో ఈ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 201314లో జమ్మూకశ్మీర్ మొదటిసారి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. నేడు ఆయన మన మధ్య లేకపోయినా.. ఆయన నాటిన విత్తనం మాత్రం చెట్టుగా మారి ప్రతిఫలాలు ఇస్తోంది.

# ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై దాదా హ్యాపీ .. టీమ్‌ఇండియాకు ఇక పండగే!

టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. అదేంటి.. ఈ ఫార్మాట్ ఇప్పుడు లేదు కదా అనే అనుమానం రాకమానదు. అయితే, సూపర్ 8లో చివరి మ్యాచ్ వెస్టిండీస్‌తో భారత్ తలపడనుంది. ఇరు జట్లకూ ఇదే అత్యంత కీలకం. ఎవరు గెలిస్తే వారు సెమీస్‌కు దూసుకెళ్తారు. అందుకే, ఇది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్. ఈ మ్యాచ్‌కు వేదిక కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్. ఈ క్రమంలో పిచ్ క్యూరేటర్ నుంచి బ్యాటర్లకు గుడ్‌న్యూస్. ఈడెన్ గార్డెన్స్ క్యూరేటర్ సమాచారం ఇచ్చిన దాని ప్రకారం.. ఈసారి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండబోతోంది. సాధారణంగా ఈడెన్ గార్డెన్స్‌లో బౌలర్లకూ సహకారం లభిస్తూ ఉంటుంది. ఈసారి మాత్రం ఎక్కువగా బ్యాటింగ్‌కే అనుకూలంగా ఉంటుందని సమాచారం. మందకొడిగా ఉన్న పిచ్‌లపై భారత బ్యాటర్లు ‘స్లో’ బంతులకు ఇబ్బందిపడటం ఈ ప్రపంచ కప్‌లో చూశాం. ఇక్కడ మాత్రం బ్యాటర్లు పూర్తి స్వేచ్ఛగా ఆడొచ్చని తెలుస్తోంది.

**క్యాబ్ అధ్యక్షుడిగా..**

భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ప్రస్తుతం బెంగాల్ క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. క్యాబ్ అధ్యక్షుడిగా గంగూలీ ఇప్పటికే పిచ్‌ను పరిశీలించినట్లు సదరు క్యూరేటర్ సుజన్ ముఖర్జీ పేర్కొన్నారు. చీఫ్ క్యూరేటర్ ఆశిష్ బౌమిక్‌తో కలిసి గంగూలీ పిచ్‌ను పరిశీలించారు. గంగూలీ చాలా సంతోషం వ్యక్తం చేశారని ముఖర్జీ తెలిపారు. బ్యాటర్లకు ఎక్కువ అనుకూలంగా ఉంటుందని.. అదే సమయంలో లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేస్తే బౌలర్లకూ సహకారం లభిస్తుందని పేర్కొన్నారు. ఇదే వరల్డ్ కప్‌లో లీగ్ స్టేజ్‌లో స్కాట్లాండ్ ఇటలీ మధ్య మ్యాచ్‌లో 200+ స్కోరు నమోదు కావడం గమనార్హం.

**తక్కువగా అంచనా వేయొద్దు!..**

ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమని సంతోషపడినా.. ఇక్కడ టాస్ అత్యంత కీలకం కానుంది. డ్యూ ఎఫెక్ట్ ఉండే అవకాశం లేకపోలేదు. దీంతో ఏ జట్టు టాస్ నెగ్గినా ఛేదనకే మొగ్గు చూపడం ఖాయం. ఒకవేళ భారత్ తొలుత బ్యాటింగ్ చేయాల్సి వస్తే మాత్రం విండీస్ ముందు భారీ లక్ష్యం నిర్దేశించాల్సిందే. కనీసం 240+ పరుగులు చేయగలిగితేనే విజయంపై ఓ భరోసా కలుగుతుంది. ఎందుకంటే విండీస్ జట్టులో 9వ నంబర్ బ్యాటర్ వరకూ హార్డ్ హిట్టర్లు ఉన్నారు. భారీ సిక్సర్లను అలవోకగా బాదేయగల సమర్థులు. అందుకే, తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు కాస్త నేర్పుతో పరుగులు రాబట్టడం అత్యంత ముఖ్యం.

